కరాసలో దొంగల హల్‌చల్
- ఐదిళ్లలో వరుస చోరీలు
- 21 తులాల బంగారం, 220 తులాల వెండి అపహరణ ·6లో



చిందరవందర చేసిన సామగ్రి

హోటళ్లకు చెక్

ఆహార నాణ్యతపై జీవీఎంసీ దృష్టి



హోటళ్లలో షీ టీమ్స్ తనిఖీలు

- జోన్‌కు రెండు చొప్పున శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ఏర్పాటు
- గత నెల రోజుల్లో 302 హోటళ్ల తనిఖీ
- కల్తీ, నిల్వ ఆహారం విక్రయిస్తున్న 173 హోటళ్లకు జరిమానా
- మరో 16 ప్రత్యేక బృందాలు ఏర్పాటుకు కమిషనర్ యోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కొత్తకొత్త హోటళ్లు, రెస్టారెంట్‌లు వెలుస్తున్నాయి. అయితే అత్యధిక శాతం నాణ్యత లేని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను కస్టమర్లకు అందజేస్తున్నాయి. వాటిని తినడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు హోటళ్లలో ఆహార నాణ్యతపై దృష్టిసారించారు. గత నెల రోజుల్లో 302 హోటళ్లలో తనిఖీలు చేయగా, 173 హోటళ్లలో నిల్వ చేసిన ఆహారాన్ని విక్రయిస్తున్నట్టు గుర్తించి జరిమానాలు విధించారు.

నగరంలో అధికారుల అంచనా ప్రకారం హోటళ్లు 500 వరకూ ఉన్నాయి. ఇవికాకుండా రోడ్డు మార్జిన్లు, కూడళ్ల వద్ద తోపుడుబండ్లు, వాహనాల మీద ఫాస్ట్ ఫుడ్ విక్రయించేవారు మరో వెయ్యి మంది వరకూ ఉండవచ్చునని అంచనా. వ్యాపారుల మధ్య పోటీ పెరగడంతో తక్కువ ధరకే ఆహారాన్ని అందించేందుకు నాణ్యతలేని పదార్థాలతో చేసిన వంటకాలు కస్టమర్లకు విక్రయిస్తున్నారు. రుచి కోసం రసాయనాలను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. ఇంకా మిగిలిన పోయిన పదార్థాలను వేడి చేసి వడ్డిస్తున్నారు. అలాంటి ఆహారం తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు దరిచేరుతున్నాయి. హోటళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించేందుకు ఆహార భద్రత, ప్రమాణాల విభాగం అధికారులు పని చేస్తున్నప్పటికీ సిబ్బంది కొరత, ఇతర కారణాల వల్ల ఆశించిన స్థాయిలో తనిఖీలు నిర్వహించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆహార నియంత్రణ మండలి, ప్రజారోగ్యం, వార్డు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (షీ) టీమ్స్‌ను ఏర్పాటుచేశారు. ఒక్కో జోన్‌కు రెండేసి చొప్పున ఎనిమిది జోన్లలో 16 బృందాలను గత నెల పదో తేదీన నియమించారు. ఆయా బృందాలు తమ జోన్ పరిధిలోని హోటళ్లు, స్టార్ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు వెళ్లి ఆహార నాణ్యత, వంటకు వాడే సామగ్రి నాణ్యత, వంటగదిలో పరిశుభ్రత వంటి అంశాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఎవరైనా నాణ్యత లేని పదార్థాలను వాడుతున్నట్టు గుర్తించినా, నిల్వ ఉంచిన ఆహారం, చికెన్, మటన్, చేపలను కస్టమర్లకు వడ్డిస్తున్నా వారిపై కేసులు నమోదుచేసి కనీసం రూ.పది వేలకు తగ్గకుండా జరిమానా విధించాలని ఆదేశించారు. గత నెల పది నుంచి ఈనెల తొమ్మిది వరకు షీటీమ్స్ 302 హోటళ్లలో తనిఖీలు చేసి 173 హోటళ్లకు రూ.2.71 లక్షల జరిమానా విధించాయి. షీటీమ్స్ ఏర్పాటైన తర్వాత ... మిగతా 6వ పేజీలో


ఉక్కు ఆర్‌ఎంహెచ్‌పీలో

మళ్లీ 12 గంటల డ్యూటీ

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ...

- ఇప్పటివరకూ ఆగస్టు నెల జీతాలు ఇవ్వని వైనం
- రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో కన్వేయర్‌ను ఎవరో కోసేశారని యాజమాన్యం ఫిర్యాదు
- ఉత్పత్తిలో వైఫల్యాన్ని ఉద్యోగులపైకి నెట్టేందుకు యత్నం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):



స్టీల్ ప్లాంటు యాజమాన్యం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా వంద శాతం ఉత్పత్తి సాధించలేక, ఆ వైఫల్యాన్ని ఉద్యోగులపైకి నెట్టేయాలని చూస్తోంది. వర్షాకాలంలో ఎటువంటి నిర్వహణ పనులు చేపట్టకుండా మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించి తప్పటడుగు వేసింది. ఎక్కడికక్కడే అడ్డంకులు వల్ల రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్‌ఎంహెచ్‌పీ)లో కన్వేయర్లు పూర్తిస్థాయిలో నడవ లేదు. దాంతో ముడి పదార్థాలు అందక ఉక్కు ఉత్పత్తి తగ్గింది. దీంతో 240 మంది మేనేజర్ స్థాయి అధికారులకు పదిహేను రోజుల పాటు ఆర్‌ఎంహెచ్‌పీలో డ్యూటీ వేసింది. ఈ నెల 5న మళ్లీ వారి విభాగాలకు పంపించింది. తాజాగా ఆర్‌ఎంహెచ్‌పీలో పనిచేస్తున్న అధికారులకు ఎనిమిది గంటల స్థానంలో 12 గంటల డ్యూటీ వేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని కానీ ఇలా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఎలా ... మిగతా 6వ పేజీలో

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు

పార్కులు, ఓపెన్‌స్పేస్‌ల పరిరక్షణకు పక్కాగా చర్యలు

- భవన నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వం
- భూముల సర్వేకు త్వరలో ఆన్‌లైన్ విధానం
- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్లతో 112 రహదారుల అభివృద్ధి
- 16 ప్రధాన కూడళ్ల ఆధునీకీకరణ
- ప్రధాన రహదారుల్లో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్
- ట్రాఫిక్‌తో పాటు కాలుష్య సమస్యకు కొంతవరకు పరిష్కారం
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



ప్రధాన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలోని పార్కులు, ఓపెన్‌స్పేస్‌లను ఆక్రమించినా, కబ్జాకు యత్నించినా క్రిమినల్ కేసులు పెడతామని కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో 1,480 పార్కులు, ఓపెన్‌స్పేస్‌లు ఉన్నాయన్నారు. వీటిలో 385 ఓపెన్ స్పేస్‌లను పార్కులుగా అభివృద్ధి చేయడం జరిగిందని, మిగిలిన వాటిని పరిరక్షించేందుకు 'ఫెన్సింగ్' వేయడంతోపాటు వాటి డాక్యుమెంట్‌లను పక్కాగా తయారుచేసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించామన్నారు. కాగా, 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో స్పెషల్‌డ్రైవ్ ప్రారంభించి 17 పార్కుల్లో ఆక్రమణలను తొలగించామన్నారు. పార్కుల నిర్వహణను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లకు అప్పగిస్తామన్నారు.

అనధికార భవన నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు అనుమతి లేకుండా అదనపు అంతస్థులు నిర్మించినా, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘన జరిగినా...ఆయా భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ చెప్పారు. భవన నిర్మాణాలు నిబంధనలకు లోబడి జరిగేలా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించేలా వ్యవస్థను తయారుచేశామన్నారు. నగరంలో ప్రభుత్వ భూములు, గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు చేయకుండా సర్వే వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశామన్నారు. త్వరలోనే ఆన్‌లైన్ సర్వే సౌలభ్యాన్ని అమలు చేయబోతున్నామన్నారు. దీనిప్రకారం సర్వే సర్టిఫికెట్ కావాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, సర్వేయర్లు సమన్వయం చేసుకుని నిర్దిత వ్యవధిలోగా నివేదికను ... మిగతా 6వ పేజీలో

నేపాల్‌లో చిక్కుకున్న నగరవాసులు



ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో దగ్ధమవుతున్న హోటల్

బస చేసిన హోటల్‌కు ఆందోళనకారుల నిప్పు

- పాస్‌పోర్టులు మినహా మిగిలిన వస్తువులు దహనం
- స్వస్థలానికి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు
- మంత్రి లోకేశ్ ఫోన్



అల్లర్లకు ముందు నేపాల్‌లో విశాఖ వాసులు (ఫైల్)

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

నగరానికి చెందిన పది మంది నేపాల్‌లో చిక్కుకున్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగులు ఆరుగురు...ఏవీఆర్‌కే మూర్తి, జి.సూర్యప్రభ, కేవీఎస్ శ్రీదేవి, కె.సత్యనారాయణ, జీవీ పద్మావతి వారి కుటుంబ సభ్యులు మొత్తం పది మంది పది రోజుల యాత్ర నిమిత్తం ఈ నెల ఐదో తేదీన నేపాల్ వెళ్లారు. ముక్తినాథ్‌ను దర్శించుకుని రెండు రోజుల క్రితం పోఖారా నగరానికి చేరుకున్నారు. అక్కడ ఓ హోటల్‌లో బస చేశారు. ఈలోగా అల్లర్లు చెలరేగాయి. ఆందోళనకారులు నిప్పు పెట్టిన వాటిలో విశాఖవాసులు బస చేసిన ... మిగతా 6వ పేజీలో

తెలుగు టైటాన్స్ జైత్రయాత్ర



తలపడుతున్న తెలుగు టైటాన్స్, యు ముంబా ఆటగాళ్లు

ప్రో కబడ్డీ లీగ్ సీజన్-12లో తెలుగు టైటాన్స్ జైత్రయాత్రను కొనసాగించింది. బుధవారం పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తుచేసింది. ... వివరాలు మెయిన్‌లో



నగరంలో వర్షం

పిడుగులతో దద్దరిల్లిన నగరం

- ఉరుములతో భారీ వర్షం... ఇండోర్ స్టేడియం వద్ద 54.75 మిల్లీమీటర్ల వర్షపాతం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరం బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు పిడుగులు, ఉరుములతో దద్దరిల్లింది. గాఢనిద్రలో ఉన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు. ఉరుములు, పిడుగులతోపాటు జోరుగా వాన కురిసింది. దీంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. సీతమ్మధారలో 54.75, పెదగంట్యాడ సమీపాన శ్రీరాంపురంలో 54.25, మహారాణిపేటలో 51.2, సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం వద్ద 48.8, హెచ్‌బీ కాలనీలో 45 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నగరంలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురు, శుక్రవారాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

15 నుంచి బ్రహ్మపూర్ పాసింజర్ రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

తిలారు, ఉర్లాం, శ్రీకాకుళం, దూసి, పొందూరు రైల్వే స్టేషన్ల మధ్య భద్రతా నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-బ్రహ్మపూర్ మధ్య నడిచే పాసింజర్ రైళ్లను (58531, 58532) ఈ నెల 15 నుంచి 27 వరకూ రద్దు చేశామని విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే ముంబై డివిజన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) ఈ నెల 10న పుణే స్టేషన్ వరకు నడుస్తుందని, అలాగే భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11020) ఈ నెల 10, 11 తేదీల్లో కర్జత్ స్టేషన్‌లో హాల్ట్ తొలగించామని పేర్కొన్నారు.

రైళ్లు ఫుల్



విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

దసరా సమయంలో బెంగళూరు, హౌరా రైళ్లలో బెర్తులు లభించని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది బెంగళూరు చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు ఊహించని డిమాండ్ ఏర్పడింది. ప్రతిరోజు నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగళూరు, భువనేశ్వర్-బెంగళూరు రైళ్లలో బెర్తులు అక్టోబరు 15వ తేదీ వరకూ అయిపోయాయి. సికింద్రాబాద్, చెన్నై వెళ్లే రైళ్లకు మాత్రం ప్రస్తుతానికి సాధారణ రద్దీ ఉంది.

'దసరా'కు ముందే రిజర్వు

- బెంగళూరు, హౌరా మార్గాల్లో భారీగా డిమాండ్
- కొన్నింటిలో అక్టోబరు నెలాఖరు వరకూ బెర్తులు లభించని పరిస్థితి
- బెంగళూరు, చెన్నై రైళ్లకు అక్టోబరు 15 వరకూ రద్దీ

హౌరా రైళ్లు ఫుల్

విశాఖ మీదుగా హౌరా వెళ్లే దాదాపు అన్ని రైళ్లలో అక్టోబరు నెలాఖరు వరకు బెర్తులు అయిపోయాయి. కోరమాండల్ (12842), యశ్వంత్‌పూర్-హౌరా (12864), ఈస్ట్‌కోస్ట్ (18046), మెయిల్ (12840), ఫలక్‌నుమా (12704), బెంగళూరు-హౌరా దురంతో (12246) వంటి రెగ్యులర్ రైళ్లకు నిరీక్షణ జాబితా కనిపిస్తోంది. షాలిమార్ (22641), మైసూరు-హౌరా (22818), వాస్కోడిగామ-షాలిమార్ (18048), గురుదేవ్ (12638), వివేక్ (22503), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), బెంగళూరు-గువాహటి (12509), చెన్నై సెంట్రల్-షాలిమార్ (22826), తిరుచిరాపల్లి-హౌరా (12664), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (29890), సికింద్రాబాద్-షాలిమార్ (22850), శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా (22832) వంటి పలు వారాంతపు రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. కోరమండల్, మెయిల్, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు, కొన్ని వారాంతపు రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా నడిచే రైళ్లల్లో కొన్ని తేదీల్లో ఏసీ కోచ్‌లలో బెర్తులు లభించే పరిస్థితి ఉంది.

బెంగళూరు రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా బెంగళూరు వెళ్లే రైళ్లలో అక్టోబరు 15 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. ముఖ్యంగా భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంతపూర్ (12863) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ని క్లాసులకు బెర్తులు నిండిపోయాయి. జసితిహ్ జంక్షన్-ఎస్ఎంవీటీ బెంగళూరు (22306), భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), గువాహటి-బెంగళూరు (12510), భగల్‌పూర్-బెంగళూరు (12254), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), హౌరా-మైసూరు ఎక్స్‌ప్రెస్ (22817), న్యూ టిన్సుకియా-బెంగళూరు (22502) ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌పై కలెక్టర్ దృష్టి

- ఉన్నతాధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- ఇబ్బందిపడుతున్న ఉద్యోగులు
- వార్డుల్లో నీటి సమస్య, క్షీణించిన పారిశుధ్యం
- రెండు, మూడు రోజుల్లో అధికారులతో ప్రత్యేక సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):



కేజీహెచ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా కలెక్టర్ కార్యాచరణ రూపొందిస్తున్నారు. గతంతో పోలిస్తే రోగుల సంఖ్య గణనీయంగా పెరగడం, వార్డుల్లో పడకల సంఖ్య పెరగకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఆస్పత్రిలో సూపరింటెండెంట్, డిప్యూటీ కలెక్టర్, సీఎస్ఆర్ఎంవో మధ్య సమన్వయం లోపం కారణంగా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్టు కలెక్టర్ గుర్తించారంటున్నారు. ఇంకా కొన్ని వార్డుల్లో నీటి సమస్య ఉంది. మరికొన్నిచోట్ల పారిశుద్ధ్యం క్షీణించింది. బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉండడంతో రోగులు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా ఎన్ని హెచ్చరికలు జారీచేస్తున్నా కొన్నిచోట్ల వసూళ్ల వ్యవహారానికి అడ్డూ అదుపులేకుండా పోతోంది. వార్డు బాయ్‌లు, గ్రైనిక్ విభాగంలో కిందిస్థాయి సిబ్బంది డబ్బుల కోసం రోగులను పీక్కుతింటున్నారు. వీటన్నింటిపై కేజీహెచ్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటుచేయాలని కలెక్టర్ నిర్ణయించారు.

సింహాచలం 'సిరి' గల్లంతుపై

తూతూమంత్రంగా విచారణ

నివేదిక తయారీ బాధ్యత కమిటీలో ఒకరికి అప్పగింత

- సిద్ధం చేసిన తరువాత వచ్చి సంతకాలు పెడతామంటూ మిగిలిన సభ్యుల ఫోన్లు
- ఆ వస్తువులన్నీ రిజిస్టర్‌లో నమోదు చేస్తామంటూ అధికారి వివరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం దేవస్థానం అధికారులు ఆభరణాల లెక్కలలో తేడాలకు కారణమైన వారిపై చర్యలు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. 'సింహాచలం సిరి గల్లంతు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన కథనంపై ఓ అధికారి స్పందించారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం ఐదుగురితో కమిటీని నియమించిందని తెలిపారు. జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి (జీవీఓ) పల్లంరాజు ఫిబ్రవరి నెలలో ఇచ్చిన నివేదిక ప్రకారం ఉప ఆలయాల్లో రిజిస్టర్ చేయకుండా ఉంచిన 9.464 కిలోల వస్తువులను ఆయా రిజిస్టర్లలో నమోదు చేశామని చెప్పారు. దాతలు వాటిని ఇచ్చిన వెంటనే ఎందుకు పుస్తకాల్లో నమోదు చేయలేదనే దానిపై ఎవరి వివరణ కోరలేదని, ఎవరిపైనా చర్యలకు సిఫారసు చేయలేదని తెలిసింది. ముత్యాలహారంలో దాదాపు 70 గ్రాముల బంగారం మాయంపై కూడా పెద్దగా విచారణ చేయలేదని విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం ఐదుగురు కమిటీలో ఉండగా, అంతా కలిసి ఒకరికే నివేదిక తయారీ ఆ బాధ్యత అప్పగించి, త్వరగా దానిని పూర్తిచేస్తే అంతా వచ్చి సంతకాలు చేస్తామని ... మిగతా 6వ పేజీలో



తాటితూరులో రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

తాటితూరులో 'పొలం పిలుస్తోంది'

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు, నగరపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకుడు ప్రసాద్ మాట్లాడుతూ వరి పంటలో నానో యూరియా వినియోగించడం వల్ల పంటకు కావాల్సిన పోషకాలు ఆకుల ద్వారా అందుతాయని, వృథా అయ్యే మోతాదు కూడా తగ్గుతుందని చెప్పారు. నాట్లు వేసిన 25 రోజుల తర్వాత పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం రెండు గ్రామాల రైతులకు నానో యూరియా, బయో ఫెర్టిలైజర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బీఎస్ కోమలి, వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

కొమ్మాది, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత స్థానానికి చేరుకుంటారని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ అధికారి షాలినీ మీనన్ సూచించారు. అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని చెప్పారు. విద్యాలయం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూబీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ సింహాచలం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు సక్రమంగా నిర్వహించాలి

భీమునిపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డిపోలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్‌ను కోరారు. బుధవారం వారు ఆర్‌డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తగరపువలస, భీమిలి పరిధిలో చాలా రేషన్ డిపోలను సక్రమంగా తెరవడం లేదని, సమయపాలన పాటించడం లేదని చెప్పారు. డీలర్ల నిర్లక్ష్యం వల్ల కార్డుదారులు వ్యయప్రయాసాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మరుపిళ్ల పైడిరాజు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు, మావూరి వీర్రాజు, ఇమంది అప్పారావు, ముత్యాలరావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

గీతం ఫార్మశీ కళాశాలకు జాతీయ గుర్తింపు

ఎండాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2025 (ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ కళాశాలకు జాతీయ స్థాయిలో 33వ స్థానం లభించిందని గీతం ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్, ర్యాంకింగ్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ రాజాప్రభు తెలిపారు. బుధవారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో నాలుగు వేలు ఫార్మశీ కళాశాలలు ఉండగా గీతం 33వ స్థానం సాధించిందన్నారు. గీతం వర్సిటీ గతంలో నాక్ ఏజీజీ గ్రేడ్‌తో పాటు క్యూఎస్ ఆసియా విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్, ఎన్‌బీఏ ర్యాంకింగ్ సాధించినట్టు చెప్పారు. ఈమేరకు ఆయన అధ్యాపకులు, పరిశోధకులను అభినందించారు.

కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు

ఆనందపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వశక్తితో ఎదగాలని సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు అన్నారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చందక గ్రామంలో 45 మంది మహిళలకు 45 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. బుధవారం ఆయన శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు కుట్టుమిషన్ ద్వారా స్వయం ఉపాధి పొందడంలో పాటు ఆసక్తి ఉన్న మరికొంతమందికి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా మహిళా సేవాదళ్ కో-ఆర్డినేటర్ కె. ఈశ్వరి, సిటీ సమితి కన్వీనర్ బి.సాయికుమార్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ జి. అపర్ణ, సత్యసాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, యూత్ సహాయ కో-ఆర్డినేటర్ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం,సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి) :అప్పన్న స్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన జి. అన్నపూర్ణ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి తిరుమలేశ్వరరావుకు చెక్ రూపంలో ఆమె బుధవారం అందజేశారు.

ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు సన్మానం

పద్మనాభం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం ఎంపీడీఓగా పని చేస్తూ పదోన్నతితో బదిలీపై వెళ్తున్న ఎం. విజయ్‌కుమార్‌ను కూటమి నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. విజయ్‌కుమార్‌కు ప్రభుత్వం డివిజనల్ డెవలప్‌మెంటు అధికారిగా పదోన్నతి కల్పించి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు డివిజన్‌కు బదిలీ చేసింది. ఈమేరకు భీమిలి ఏఎంసీ చైర్మన్ రామస్వామినాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, టీడీపీ నాయకుడు ఎర్నాయుడు సత్కరించారు.

వీఆర్‌ఓలతో తహశీల్దార్ సమావేశం

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సేవలందించాలని రెవెన్యూ సిబ్బందికి తహశీల్దార్ కాకర ఆనందరావు సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్ ఓలు, సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలపై కూడా దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో డిటి చంద్రశేఖర్, సర్వే డీటీ శ్రీనివాసరావు, తదితరలు పాల్గొన్నారు.



పాడైన డిజిటల్ లైటింగ్ బాక్స్



విరిగిపోయిన బెంచీలు



మరమ్మతుతో ఉన్న డిజిటల్ లైటింగ్ బాక్స్‌లు

అధ్వానంగా గంట స్తంభం పరిసరాలు

- ఏడాదిగా నిర్వహణ కరువు
- చుట్టూ పేరుకుపోయిన చెత్త
- విరిగిన రెయిలింగ్, బెంచీలు
- పాడైన డిజిటల్ లైటింగ్ బాక్స్

భీమునిపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంటస్తంభం పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ ప్రాంతాన్ని కొన్నేళ్ల క్రితం జీవీఎంసీ సుందరీకరణ పనుల్లో భాగంగా లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసింది. గంట స్తంభం చుట్టూ టైల్స్ వేసి, సిమెంట్ కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే చుట్టూ స్టీల్ రెయిలింగ్ అమర్చారు. రాత్రి వేళ గంట స్తంభం రంగురంగుల్లో చూపరులను ఆకట్టుకునే డిజిటల్ లైటింగ్ కూడా అమర్చారు.అయితే ఏడాదిగా నిర్వహణ లోపం వల్ల ఇవన్నీ మూలకు చేరాయి.స్తంభం చుట్టూ ఉన్న పరిసరాలు కూడా అధ్వానంగా తయారయ్యాయి. సిమెంట్ బెంచీలు, కుర్చీలు విరిగిపోయాయి.రెయిలింగ్ ప్రహరీ నుంచి ఊడి కింద పడింది. డిజిటల్ లైటింగ్ సిస్టమ్ పూర్తిగా పాడై వెలగడం లేదు. చీకటి పడిన తరువాత మందుబాబులు మద్యం సేవిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గడియారం పాడై కొన్నేళ్లు కావస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి చాలా మంది సీనియరు సిటిజన్లు వచ్చి కాలక్షేపం చేస్తుంటారు.పరిసరాలు చెత్తాచెదారంతో ఉండడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు గంట స్తంభానికి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



గంట స్తంభం ప్రాంతంలో అపరిశుభ్రత



విరిగిపోయిన రెయిలింగ్

రుషికొండలో స్థల వివాదం

సాగర్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రైవేట్ లేఅవుట్‌లో తనకు చెందిన రెండు స్థలాలను ఇద్దరు వ్యక్తులు ఆక్రమించినట్టు ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మతుకుమిల్లి భరద్వాజ పీఎంపాలెం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ వద్ద 2016లో భరద్వాజ 267 గజాల విస్తీర్ణం గల ఆరు ప్లాట్లను కొనుగోలు చేశారు. వాటిలో 33ఏ, 33బి ప్లాట్లకు చెందిన వెంకటేశ్వరాచార్యులు, పెరవల నరసింగరావు వద్ద నుంచి అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్‌లతో పోలవరప్రసాద్, పవన్ కుమార్ ఆయా ప్లాట్లలో ప్రారంభించడంతో భరద్వాజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల తోటల సాగుకు ఉపాధి నిధులు

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు పండ్ల తోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో గౌరి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పండ్ల తోటల పెంపకానికి ఉపాధి నిధులు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. పండ్ల మొక్కలు నాటే రైతులకు మూడేళ్ల పాటు ఈ నిధులు వస్తాయని వివరించారు. అన్ని రకాల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అవకాశాం కల్పించిందన్నారు. పాడిపై ఆధారపడిన వారు తప్పకుండా పశుగ్రాసం పెంపకం చేపట్టాలని సూచించారు. పశుగ్రాసం పెంపకానికి కూడా ఉపాధి హామీ పథకం కింద అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువతలో సాంకేతిక నైపుణ్యం అద్భుతం

కొమ్మాది, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టెక్నాలజీలో యువత సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం అద్భుతమని ఏయూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్ రౌండ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 35 జట్లు హాజరై రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. అత్యుత్తమ ప్రదర్శన చూపిన పది జట్లకు ప్రథమ స్థానం,మరో పది జట్లకు ద్వితీయ స్థానం ప్రకటించారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ భవిష్యత్‌లో క్వాంటం టెక్నాలజీ ప్రాధాన్యతను వివరించారు. సెమీ ఫైనల్ రౌండ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు ఈనెల 13న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులతో పాటు ఏయూ ప్రొఫెసర్లు, గాయత్రి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

కామాఖ్య-బెంగళూరు (12552), పూరి-బెంగళూరు గరీబ్‌రథ్ (22883), హౌరా-బెంగళూరు దురంతో (12245), అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504) ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. ప్రతి శుక్రవారం అందుబాటులో ఉండే టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111)లో కూడా అక్టోబరు 31 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

చెన్నై మార్గంలో..


చెన్నై వెళ్లే మెయిల్ (12839), బొకారో (13351), టాటా-ఎర్నాకులం (18189) వంటి రెగ్యులర్ రైళ్లలో అక్టోబరు 16 వరకూ బెర్తులు నిండిపోయాయి. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841)లో అక్టోబరు 18 వరకు బెర్తులు నిండినా, కొన్ని తేదీల్లో ఏసీ బెర్తులు లభించే పరిస్థితి ఉంది. భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), షాలిమార్-త్రివేండ్రం (22642), గువాహటి-బెంగళూరు (12510), హౌరా-తిరుచిరాపల్లి ((12660), ముజఫర్‌పూర్-యశ్వంతపూర్ (15228), సంత్రాగచ్చి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ (22807), న్యూజలపాయ్‌గురి-మద్రాసు (22616) వంటి వీక్లీ, బై వీక్లీ రైళ్లకు డిమాండ్ నెలకొంది. విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు (22801) అక్టోబరు 17 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

సికింద్రాబాద్ రైళ్లకు అందుబాటులో బెర్తులు

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), గరీబ్‌రథ్ (12739), కోణార్క్ (11020), ఫలక్‌నుమా (12703), వందేభారత్ (20833), విశాఖ-నాందేడ్ (20811), ఎల్‌టీటీ (18519), దురంతో (22203) వంటి ప్రధాన రైళ్లకు దసరా రద్దీ అంతగా కనిపించలేదు. దాదాపు అన్ని రైళ్లకు బెర్తులు లభించే పరిస్థితి ఉంది. గోదావరి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్, వందేభారత్, జన్మభూమి వంటి రైళ్లకు ఈ నెల 18 నుంచి ఖాళీలు ఉన్నాయి.

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్ అజయ్‌జైన్

సింహాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పర్యాటక, యువజన, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజేయ్ జైన్ సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ డిప్యూటీ ఈఓ సింగం రాధ అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.



స్వామివారి సన్నిధిలో అజయ్‌జైన్ దంపతులు

నేపాల్‌లో చిక్కుకున్న నగరవాసులు

... 5వ పేజీ తరువాయి

హోటల్ కూడా ఉంది. పాస్‌పోర్టులు తప్ప వారు తీసుకువెళ్లిన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. వారిని లేక్‌సైడ్ ప్రాంతంలో ఉన్న మరో హోటల్‌కు తరలించారు. అక్కడ నుంచి కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయంలో జ్యోతి అనే అధికారిని సంప్రతించగా, హోటల్‌లోనే ఉండాలని సూచించినట్టు సూర్యప్రభ బుధవారం సాయంత్రం ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. నేపాల్‌లో తమతోపాటు రాష్ట్రానికి చెందినవారు మరికొంతమంది ఉన్నారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నామని వివరించారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని సొంతూళ్లకు తీసుకురావడానికి ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేస్తున్నదన్నారు. తమతో మంత్రి నారా లోకేశ్ మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. గురువారం ఉదయం పోఖారా నుంచి హెలికాప్టర్‌లో కాఠ్మాండూకు తరలించి ప్రత్యేక విమానం లోమధ్యాహ్నం ఢిల్లీ తీసుకు వెళ్లడానికి ఏర్పాట్లుచేశారన్నారు.కళ్లముందు జరుగుతున్న అల్లర్లు చూసి భయమేసిందని, ఎంతోమంది నిరాశ్రయులయ్యారన్నారు.

తూతూమంత్రంగా విచారణ

... 5వ పేజీ తరువాయి

ఫోన్ల ద్వారా చెప్పినట్టు తెలిసింది. దీనిని బట్టి తూతూమంత్రంగా విచారణ ముగిస్తున్నట్టుగా అర్థమవుతోంది.

30 ఏళ్ల సర్వీసులో వెండి గ్లాసు చూడలేదట

సింహాచలంలో సిరి గల్లంతు కథనంపై అర్చకుల్లో ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. స్వామి వారి పూజలకు ఉపయోగించే వస్తువులు ఆలయంలోనే ఉంటాయని, ఎవరైనా అర్చకులు పదవీ విరమణ చేస్తే వాటిని భౌతికంగా తరువాత వచ్చే అర్చకులకు అప్పగించడమే ఆనవాయితీగా వస్తోందని, లెక్కలు చూసి తీసుకోవడం తన 30 ఏళ్ల సర్వీసులో ఎప్పుడూ చూడలేదని ఆయన వివరించారు.స్వామివారి పూజాసామగ్రిలో మొదట వెండి గ్లాసు పేరు రిజిస్టర్‌లో ఉంటుందని, ఎప్పుడూ ఆ గ్లాసును చూడలేదని సదరు అర్చకుడు చెప్పడం గమనార్హం. అంటే..దేవస్థానంలో పుస్తకాలలో లెక్కలకు, వాస్తవంగా ఉండే వస్తువులకు పొంతన ఉండదని అర్థమవుతోంది. అయితే అధికారులు మాత్రం తనిఖీలు, విచారణ అంటూ మసి పూసి మారేడు కాయ చేసి భక్తులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

భీమునిపట్నం(రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లల తాళ్లవలస గ్రామానికి చెందిన మేకల వ్యాపారి గొలగాని వివేక్ (20) కొద్ది రోజులుగా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 8న వివేక్ తన సోదరుడు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి, తాను విజయగరం జిల్లా సవరవిల్లి సంతకు వెళుతున్నానని. మేకలను అమ్మకానికి అక్కడికి తీసుకురావాలని చెప్పాడు. శ్రీనివాస్ మేకలను తీసుకుని ఉదయం సంతకు వెళ్లగా, వివేక్ కనిపించలేదు. ఫోన్ చేసినా.. స్పందించ లేదు. అదే రోజు సాయంత్రం మరోసారి ఫోన్ చేస్తే తాను ఆనందపురం జంక్షన్‌లో ఉన్నానని, బైక్ అక్కడే వదిలి వెళ్లిపోతున్నానని, తన గురించి వెతకవద్దకు చెప్పాడు.వివేక్ తండ్రి పాపయ్య ఫిర్యాదు మేరకు సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివేక్ (ఫైల్‌ఫొటో)

'జగన్ మళ్లీ సీఎం కాలేడు'

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కాలేడని, కేసులు మాఫీ చేయించుకుని కుటుంబంతో గడపడం మంచిదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. నగరంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా కొడుకును బిలియనీర్‌ను చేశాడన్నారు. జగన్ సీఎం అయిన తరువాత లిక్కర్ కుంభకోణం చేసి మరింత సంపాదించాడని ఆరోపించారు. మళ్లీ సీఎం కావాలన్న ఉద్దేశంతో ఆకుపచ్చ కండువాలు వేసుకుని రైతుపోరు పేరుతో ఆందోళనలు చేస్తున్నారని, అయితే, జగన్ మరోమారు ముఖ్యమంత్రి కావడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేయాలని, ఆయన శక్తి సామర్థ్యాలు తమకు తెలుసునన్నారు. ప్రైవేటీకరణ ఆపకుంటే కూటమి నుంచి బయటకు రావాలన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేసే సమర్థత చంద్రబాబుకు ఉందన్నారు.

కరాసలో దొంగల హల్‌చల్

మాధవధార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఏడీ కొత్తరోడ్డు దగ్గర కరాసలో బుధవారం దొంగలు హల్‌చల్ సృష్టించారు.తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడ్డారు. ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్‌స్టేషన్ నేర విభాగం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 52వ వార్డు కరాసలో పలు ఇళ్లల్లో ఒకే రోజు జరిగిన దొంగతనాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. వరుసగా ఒక్క రాత్రిలో (మంగళవారం అర్ధరాత్రి దాటాక, బుధవారం తెల్లవారు సమయంలో) 5 ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇందులో నాలుగు ఇళ్లలో 11 తులాల బంగారం, రూ. 15 వేల నగదుతో పాటు 20 తులాల వెండి దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ప్రియాంక కాలనీలో ఏసుబాబు, దేవి సప్లయర్స్ నిర్వాహకులు శ్రీను ఇంటితో సహా రామాలయం వీధి అభీష్, దంపతులవారి వీధిలో పద్మ, భేరి వీధిలో శ్రీను ఇళ్లలోనూ చోరీ ఘటనలు జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ఒక ఇంట్లో 22 గ్రాముల బంగారం, మరొకరి వద్ద రూ.15 వేల నగదు, 200 తులాల వెండి, మరో ఇంట్లో ఎనిమిదిన్నర తులాల బంగారం పోయాయి.



చోరీ జరిగిన ఓ ఇంట్లో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఘటనా స్థలానికి పోలీసు అధికారులు

వరుస దొంగతనాల సమాచారం మేరకు కరాస ప్రాంతానికి చేరుకున్న డీసీపీ లతా మాధురి, వెస్ట్ సబ్‌డివిజన్ క్రైమ్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, సీసీఎస్ విభాగం సీఐలు కె. రామారావు, చంద్రశేఖర్ ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయంతో వేలిముద్రలు తీసుకున్నారు. దొంగల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. సీసీ కెమేరాల ఏర్పాటు ఆవశ్యకతను స్థానికులకు తెలియజెప్పారు.

ఎండాడలో నాగుపాము కలకలం

ఎండాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ ఎంకే గోల్డ్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న షెడ్‌లోకి నాగపాము ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేసింది. వెంటనే స్థానికులు స్నేక్ క్యాచర్ కిరణ్‌కి సమాచారం ఇవ్వడంతో అతను పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు.



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

హోటళ్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

హోటళ్ల ధోరణిలో మార్పు మొదలైనట్టు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ వస్తుండడంతో అదనంగా మరో 16 బృందాలను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు.

స్టార్ హోటల్‌లో చేదు అనుభవం ఎదురైంది

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

నేను కుటుంబంతో కలిసి నగరంలోని ఒక స్టార్ హోటల్‌కు వెళ్లాను. అక్కడ టీ తాగేందుకు కంటెయినర్ వద్దకు వెళ్లాను. గాజు కంటెయినర్ లోపల టీ పొడి చుట్టూ ఫంగస్ పేరుకుపోయి కనిపించింది. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి నమూనాలు సేకరించి పరీక్ష చేయించాను. అక్కడున్న టీపొడిలో రంగు కలిపినట్టు పరీక్షలో తేలింది. ఆ హోటల్‌లో ఆహార పరిస్థితి కూడా అలాగే కనిపించింది. అలాగే గాజువాక జోన్‌లో పనిచేసే ఒక అధికారి నిత్యం బిర్యానీ తీసుకువెళ్లే ఒక హోటల్‌లో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన చికెన్, నాణ్యత లేని మసాలా, రుచికోసం రసాయనాలు వినియోగించినట్టు తేలింది. కల్తీ, మితిమీరిన రసాయనాలు కలిపిన ఆహారం తినడం వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. స్టార్‌హోటళ్లలో కూడా అదే పరిస్థితి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అలాంటి వాటిని కూడా ఉపేక్షించేది లేదు.

మళ్లీ 12 గంటల డ్యూటీ

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తామని వారు వాపోతున్నారు. ఇదిలావుంటే ఆగస్టు నెల జీతాలు సెప్టెంబరు 10వ తేదీ వచ్చినా ఇంతవరకూ ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. ఇప్పటికే మూడు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయి. ఇలాగైతే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని వారు వాపోతున్నారు. కేంద్రం హామీ ఇచ్చిన ఆర్థిక సాయంలో భాగంగా మంగళవారం రాత్రి రూ.840 కోట్లు స్టీల్ ప్లాంటు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. రూ.60 కోట్లు విడుదల చేస్తే ఉద్యోగులకు జీతాలు ఇవ్వవచ్చు. కానీ యాజమాన్యం దానికి ఒప్పుకోవడం లేదు. జీతాలు ఇవ్వకుండా పనిభారం మోపుతోంది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో ఒకచోట కన్వేయర్ బెల్ట్ తెగిపోయిందని, దానిపై అనుమానాలు ఉన్నాయని యాజమాన్యం తరఫున స్టీల్ ప్లాంటు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వాస్తవానికి ఆర్ఎంహెచ్‌పీలో సమస్యలు ఉన్నాయని అధికార వర్గాలు ముందు నుంచి చెబుతున్నాయి. యాజమాన్యం వాటిని పెడచెవిన పెట్టింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఉత్పత్తి లేకపోవడంతో ఆ నెపాన్ని కార్మికుల మీదకు నెట్టేయడానికి, కన్వేయరు బెల్ట్ ఎవరో కోసేశారని ఫిర్యాదు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది సరైన విధానం కాదని, సంస్థ ఆస్తులకు నష్టం చేసే ఆలోచన కలిగిన కార్మికులు, ఉద్యోగులు లేరని సంఘాల నాయకులు చెబుతున్నారు.

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు

... 5వ పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారన్నారు. దీనివల్ల సర్వేయర్లు చేతివాటానికి, అవినీతికి అడ్డుకట్టపడడంతోపాటు ప్రభుత్వ భూములు పరిరక్షణ, గెడ్డల ఆక్రమణకు అడ్డుకట్టపడుతుందన్నారు. నగరంలో రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ ఏడాదికాలంలో అభివృద్ధి చేసేందుకు 112 రహదారులను (ప్రతి వార్డులో కనీసం ఒక రోడ్డునైనా) ఎంపిక చేశామన్నారు. అలాగే నగరంలో 16 ప్రధాన కూడళ్లను ఆధునికీకరించాలని నిర్ణయించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నగరంలో సీసీ, బీటీ రోడ్ల కోసం రూ.250 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. టీడీఆర్ బాండ్ల జారీని పారదర్శకంగానే చేస్తున్నామని, ప్రస్తుతం 450కిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నగరంలో గెడ్డలు, వరద నీటి కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నగరంలో 23 డ్రైన్‌ల ద్వారా మురుగునీరు సముద్రంలో కలుస్తున్నదని, వాటిని కొత్తగా నిర్మించబోయే నాలుగు పంప్‌హౌస్‌ల ద్వారా అప్పుఘర్, సాగర్‌నగర్, భీమిలిల్లో కొత్తగా నిర్మించే ఎస్‌టీపీలకు మళ్లిస్తామన్నారు. నగరంలో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చితో కలిసి కార్యాచరణ అమలుచేస్తున్నామన్నారు. 115 ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను స్మార్ట్ సిగ్నల్స్‌గా అభివృద్ధి చేయడంతోపాటు జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన మార్గాల్లోని 56 ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నల్ సింక్రనైజేషన్ చేయబోతున్నామన్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రెండు సంస్థలకు రెండేసి సిగ్నల్ పాయింట్లను కేటాయించామని, అక్కడి ఫలితాల ఆధారంగా మిగిలిన జంక్షన్లలో కూడా అదే తరహా సదుపాయం ఏర్పాటుచేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ఈనెలలోనే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలుస్తామన్నారు. ఒకచోట గ్రీన్‌సిగ్నల్ లభిస్తే తర్వాత సిగ్నల్ వద్దకు వెళ్లేసరికి అక్కడ కూడా గ్రీన్ సిగ్నల్ ఉంటుందన్నారు. దీనివల్ల వాహనదారులు ప్రతి జంక్షన్‌లో ఆగాల్సిన అవసరం ఉండదు కాబట్టి ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. 'బ్లూమ్‌బర్గ్ మేయర్స్ ఛాలెంజ్-2025'కు ప్రపంచవ్యాప్తంగా 50 నగరాలు ఎంపికైతే అందులో జీవీఎంసీకి చోటు దక్కడం నగరవాసులకు గర్వకారణమన్నారు. పట్టణ ప్రాంతంలో సమస్యల పరిష్కారాన్ని ప్రజలే గుర్తించడం కోసం జీవీఎంసీ 'వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వి-పీయూఎల్ఎల్) మోడల్‌ను పైలట్ ప్రాజెక్టుగా 19వ వార్డు పరిధిలోని గణేష్‌నగర్‌లోనూ, 44వ వార్డు పరిధిని ఎంపిక చేసి కార్యక్రమాలు అమలుచేస్తుండడంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు జీవీఎంసీ అందించే సేవలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేయడంతోపాటు వారే సమస్యలకు పరిష్కారం సూచించేలా కృషిచేస్తున్నామన్నారు.

స్నేహితుడి కారుతో పరారీ

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అవసరం ఉందంటూ కారు తీసుకున్న స్నేహితుడు తర్వాత వాహనంతో సహా పరారవడంతో బాధితుడు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మార్కెట్‌లో ఉంటున్న మేరుగు విజయ్‌కుమార్ 2021, జూలై 10న తన స్నేహితుడైన సతీష్‌ను కలవడానికి ఉషోదయ కూడలి వద్దకు వచ్చాడు. అక్కడ సతీష్ తన స్నేహితుడంటూ అజ్జూబాయ్‌ని పరిచయం చేశాడు. అజ్జూబాయ్ తల్లి కాకినాడలోని ఓ ఆస్పత్రిలో ఉందంటూ విజయ్‌కుమార్‌కు చెప్పి, ఒకసారి కారుఇవ్వాల్సిందిగా సతీశ్ కోరాడు. అతడిపై నమ్మకంతో విజయ్‌కుమార్ కారును ఇచ్చారు. అయితే రోజులు గడిచినా కారు తిరిగి ఇవ్వలేదు. కొన్ని నెలల తర్వాత సతీష్ కూడా తనఇంటిని ఖాళీ చేసి పరారయ్యాడు.తాజాగా విజయ్‌కుమార్ ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తుచేస్తున్నారు.

ఇదేనా సుందరీకరణ?

- ముఖ్య ప్రాంతాలు, కూడళ్లకే స్మార్ట్ పనులు పరిమితం
- పలు చోట్ల అధ్వానంగా పరిసరాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహా నగర పాలక సంస్థ నగర సుందరీకరణకు రూ.కోట్లు ఖర్చు వెచ్చిస్తోంది. కానీ ప్రధాన ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో చెత్తకుప్పలు, వ్యర్థాలతో నిండి అధ్వానంగా ఉన్నా, కనీసం అటు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్ సిటీ నిధులతో ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లను రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. ఇటీవల టీటీడీ కూడలిని శంకుచక్రనామాలతో అందంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీప కాంతులతో పాటు, వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేసి, ఆ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిదారు. కానీ ఇదే ప్రాంతంలోని కూలవేటు దూరంలో అధ్వానంగా ఉన్న డివైడర్లను పట్టించుకోకపోవడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. డివైడర్ల ఇనుప గ్రిల్స్ విరిగిపోయి, మధ్యలో మొక్కలు ఎండిపోయి, అందులో వ్యర్థ తీగెలు ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఈ ప్రాంతం అధ్వానంగా కనిపిస్తోంది. ఓ ప్రాంతంలోనే అభివృద్ధి చేపట్టి దానినే సుందరీకరణ అంటే ఎలా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధ్వానంగా ఉన్న అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడితే బాగుం టుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో డివైడర్ల మధ్య పేరుకు పోయిన చెత్తాచెదారాలు, పనికి రాని ఇనుప ఊచలను తొలగించాలని కోరుతున్నారు.



డివైడర్లపై విరిగిన గ్రిల్స్



ఎంవీపీ కూడలిలో డివైడర్ల మధ్య నిర్లక్ష్యంగా పడి ఉన్న కేబుల్ తీగలు

సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

సిరిపురం సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంకట హర చతుర్థి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మోహన్ స్వామి ఆధ్వర్యంలో నగరంలోని ఆశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి విశేష హోమం చేశారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సంకట హర చతుర్థి నాడు సంపత్ వినాయకుడికి గరిక సమర్పిస్తే, కోరిక కోర్కెలు తీరుతాయనే ప్రగాఢ నమ్మకంతో తెల్లవారి జాము నుంచే స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉపవాసం ఆచరించిన భక్తులు సాయంత్రం స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు టి.రాజేశ్వరన్ చోళన్, ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు అందుకుంటున్న సంపత్ వినాయగర్ స్వామి

గ్రేటర్ కమిషనర్‌నే ఏమార్చారు!

- క్షేత్ర పర్యటనలో ఆక్రమణలపై దృష్టి సారించకుండా జాగ్రత్తలు
- జోన్-3 అధికారుల మాయాజాలం



కృష్ణ మందిరం పక్కన్న కాలువలను మూసేసి ఆక్రమణలు



వర్షం పడితే చిత్తడిగా మారుతున్న మార్గం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు జోన్3 అధికారులు, సిబ్బంది మసిబూసి మారేడుకాయ చేశారు. మంగళవారం జోన్-3 పరిధిలోని 16వ వార్డులోని ఇసుకతోట కృష్ణ మందిరం ప్రాంతంలో పర్యటించిన ఆయనకు పక్కనే ఉన్న ఆక్రమణ, సమస్య మార్గాన్ని చూపించకుండా దాటవేశారు. కృష్ణ మందిర్ మార్గంలో బడాబాబులు కాలువలను మూసేసి మరి కార్యకలాపాలు చేస్తున్నా అటు వైపు కమిషనర్ కన్నెత్తి చూడకుండా జోన్-3 అధికారులు జాగ్రత్త వహించారు. కేవలం ప్రధాన మార్గంలోనే గెడ్డను పరిశీలించడం, చిరు వ్యాపారులపై అపరాధ రుసుం విధించడం, ఆ మార్గంలోనే పర్యటించి వెళ్లిపోయేలా జోన్-3 బృందం తమ చాకచక్యాన్ని ప్రదర్శించారు. కేవలం ప్రధాన మార్గంలోనే పర్యటించిన కమిషనర్ కృష్ణమందిర్ పక్క మార్గంలోకి ఎక్కడ వెళతారో, తమ అసమర్థ చర్యలు ఎక్కడ బయటపడతాయోనని బిక్కుబిక్కుమంటూ ఆయన ఉన్నంత సేపూ ఆందోళనకు గురయ్యారు. ప్రధాన మార్గానికి ఆనుకుని ఉన్న ఈ మార్గమంతా పూర్తిగా కాలువలు మూసేసి బహుళ అంతస్తుల నిర్మాణం, కార్ల పార్కింగ్ చేయడం వల్ల కాస్త పెద్ద వర్షం పడితే చాలుఈ మార్గమంతా బురదమయంగా మారుతుంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి స్థానికులు తీసుకురాకుండా జోన్-3 అధికార బృందం చాకచక్యంగా నడుచుకున్నారు.

12, 13 వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో రూ.1.19 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. వెర్ని దుర్గానగర్‌లో రోడ్డుల, డ్రైనేజీల నిర్మాణాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండా ధర్మారావు, కార్యదర్శి సురేష్, తెలుగు మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి, బాలస్వామి, టీడీపీ బీసీ సెల్ వార్డు అధ్యక్షుడు వడిసెల శ్రీను, సీనియర్ నాయకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అలాగే 12వ వార్డులోని పెదగదిలి శివాలయం వీధిలో గల కొండవాలులో సుమారు 63.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు కాలువ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ కొండవాలు ప్రాంతంలో ఇప్పటికే రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తి చేశామని, అలాగే యూజీడీ పనులు కూడా ఈ వారంలో ప్రారంభిస్తామని తెలిపారు ఇంకా ఏవైనా పెండింగ్ పనులు ఉంటే ప్రతిపాదనలు రూపొందించిన పంపాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, డీఈ వెంకటరావు, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, 12వ వారు కార్యదర్శి పోతిన భరత్, దువ్వి సంతోష్, అనంద్ పాల్గొన్నారు.



వెర్ని దుర్గానగర్‌లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

సేవా సంస్థకు రూ.3 లక్షల విరాళం

మురళీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫార్మజెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించే టచ్ స్టోన్ చారిటీస్ ఆర్గనైజేషన్‌కు బుధవారం రూ.3 లక్షల విరాళాన్ని అందించింది. సీఎస్ఆర్ నిధులతో వంట సామగ్రిని సమకూర్చారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని టచ్ స్టోన్ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫార్మజెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ అనంత్ దత్తాత్రేయ ఈ మొత్తాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం భోజన సదుపాయం కల్పిస్తున్న టచ్ స్టోన్ సంస్థకు ఉపయోగపడే విధంగా వంట సామగ్రి సమకూర్చామన్నారు. హెచ్‌ఆర్ మేనేజర్ అప్పారావు పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి

- ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఫెడరేషన్ నేతలు, సభ్యులు

సిరిపురం సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం అమలుతో ఆదాయం కోల్పోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రహమాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేస్తుండటంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 21, 31 వల్ల ఆటో, క్యాబ్ డ్రైవర్లపై వేస్తున్న అపరాధ రుసుం వారికి తీవ్ర భారంగా మారిందన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.5 వేల ఆర్థిక సా యం అందించాలన్నారు.ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు చెల్లించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రదర్శనగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, ప్రతినిధులు సాయికుమార్, నాగేశ్వరరావు, రాంబాబు, బుజ్జిబాబు, అప్పలరాజు, అన్నాజీ పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్ల చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్‌పై ప్రచారం చేస్తున్న ఆటో కార్మికులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే ఆటో డ్రైవర్ల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం 15, 16వ వార్డుల్లోని ఆటో స్టాండ్‌ల వద్ద యూనియన్ తరఫున ఆటో కార్మికులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో ఫెడరేషన్ 15, 16వ వార్డుల అధ్యక్షుడు ఎస్.మధురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆదాయ కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ఆదుకోవాలని కోరారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఫెడరేషన్ నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో చేపడుతున్నట్టు చెప్పారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఉన్న ఓ బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎంవీపీ కాలనీ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీపాలేనికి చెందిన కె.నారాయణరావు(25) మంగళవారం మధ్యాహ్నం ఇసుకతోట కృష్ణా కళాశాల సమీపంలో మూత్ర విసర్జన చేస్తుండగా, అతి వేగంగా బైక్‌పై వచ్చిన వ్యక్తి, అతడిని ఢీకొట్టి పరారయ్యాడు.

ఈ ప్ర మాదంలో నారాయణరావుకు శరీరంపై పలు గాయాలతో పాటు కాలు విరిగిపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 16, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36,అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 44,కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

జలమయమైన పెదగదిలి కూడలి

- లోతట్టు ప్రాంతం కావడంతో నిలిచిపోయిన వరద నీరు
- వాహనదారులు, చిరు వ్యాపారుల అవస్థలు
- వర్షం వస్తే చాలు ముంచుకొస్తున్న సమస్య



పెదగదిలి రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఆరిలోవ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెదగదిలి, పరిసరాలు వరదనీటి మయమయ్యాయి. వర్షం దెబ్బకు చిరు వర్తకులు, ఫ్లాట్‌ఫారాలపై విక్రయాలు చేపట్టేవారు, కూరగాయల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఇది లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం నీరంతా నిలిచిపోయి చెరువును తలపించింది. చిన్నపాటి వర్షం కురిసినా ఈ ప్రాంతం వరద నీటితో మునిగిపోతుండడంతో వాహనదారులు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వచ్చిన ఇదే పరిస్థితి నెలకొంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హనుమంత వాక నుంచి సింహాచలం వెళ్లేందుకు ఈ మార్గమే ఆధారం. దీంతో ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వర్షం పడిన ప్రతిసారి ఈ విధంగా పెదగదిలి నీట మునిగిపోవడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం.


వర్షం పడినప్పుడు తొలువ చినగదిలి సాయిబాబాగుడి ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెదగదిలి జంక్షన్‌కు చేరుతుంది. ఈ నీటిని అక్కడ ఉన్న కాలువల్లోకి మళ్లిస్తే ఈ ఇబ్బందులు ఉండవని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు జీవీఎంసీ అధికారులకు విన్నవించామని, కానీ సమస్య మాత్రం ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెదగదిలి జంక్షన్ ముంపు నుంచి రక్షించాలని కోరుతున్నారు.



వర్షం నీరు చేరడంతో తోపుడుబండ్ల వ్యాపారుల అవస్థలు

'చెస్ టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ముదావహం'

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సహకారంతో అడుసుమిల్లి సురేష్, రత్తయ్యల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం ఆనందదాయకమని రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ప్రపంచ కప్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపికకు కీలకంగా నిలిచే జాతీయ చెస్ టోర్నీని విజయవంతం చేసేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలందించేందుకు ముందుకు రావడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్ర సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, రత్తయ్య

చెట్ల కొమ్మలు తొలగింపు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలకు, వీస్తున్న గాలులకు చెట్టు కొమ్మలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవతో బుధవారం అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగింపజేశారు. హార్టీకల్చర్ సిబ్బంది మెషిన్‌తో గుబురుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి ప్రమాదాలు జరగకుండా, పడిపోవడానికి సిద్ధంగా ఉన్న చెట్లను కూడా తొలగించి వేశారు. సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం, హెచ్‌బీ కాలనీలో ఈ చెట్టు కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.



అంతర్ వర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నీకి ఏయూ ఆతిథ్యం

- స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య విజయ్‌మోహన్ వెల్లడి

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ టోర్నీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యమివ్వనుందని ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ తెలిపారు. ఏయూ పరిధిలోని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్ వర్సిటీ క్రికెట్ పోటీల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలందించాలని కోరారు. అలాగే ఈ నెల 25న ఏయూ విలువిద్య జట్టు, 25న యోగా పురుషుల జట్టు ఎంపికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది జరగాల్సిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఏయూ జట్లను ఎంపిక చేసేందుకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించాలన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రీడా కార్యకలాపాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, అక్కడ అనుమతులు లభించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఐదు జిల్లాల్లోని ఏయూ అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు నిబద్ధతతో పనిచేసి క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు శతాబ్ది క్రీడా పోటీలు విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పల్లవి, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ కిరణ్మయి,డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వాసు దేవరాజు, డాక్టర్‌బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ఎస్.గోపీకృష్ణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విజయ్‌మోహన్

ఆటో డ్రైవర్‌పై ఇద్దరు అనుచిత ప్రవర్తన

- వాహనం నుంచి లాగి కింద పడేయడంతో కారు ఢీకొని తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవరు తాగి ఉన్నాడని, ఆటోలో నుంచి బయటకు లాగి రోడ్డుపై పడేశారు స్నేహితులు. వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శివాజీపాలెం ఆరు కొళాయిల జంక్షన్ సమీపంలో ఉంటున్న నాగళ్ల పోలయ్య మంగళవారం మధ్యాహ్నం తన ఆటోలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం మూడున్నరకు పోలయ్య భార్య జ్యోతికి ఓ వ్యక్తి ఫోన్ చేసి, పోలయ్య తాగి ఆటోలో నుంచి పడిపోయాడని, అతడి స్నేహితులు గొలగాని గోపాల్, దుర్గ కేజీహెచ్‌లో చేర్పించారని తెలిపాడు.

ఈ సంఘటనపై జ్యోతి వివరాలు తెలుసుకోవడంతో పాటు, శివాజీపాలెంలోని తాండ్రపాపారాయుడు ఫంక్షన్ హాలు సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా, ఆటోలో నుంచి పోలయ్యను గోపాల్, దుర్గ బయటకు లాగి, రోడ్డుపై పడేయడంతో, వేగంగా వచ్చిన ఏపీ 39 ఎఫ్‌క్యూ 4798 నెంబరుగల కారు పోలయ్య పై నుంచి వెళ్లిపోవడంతో చాతి, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.

ఈ సంఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్లకు సరికొత్త ఇ పోస్ మెషీన్ల పంపిణీ నేడు



మురళీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోలకు సరికొత్త ఇ పోస్ స్కానర్ మెషీన్లను గురువారం సరఫరా చేయనున్నారు. పౌరసరఫరాల శాఖ కంచరపాలెం సర్కిల్-1 పరిధిలో వీటిని డీలర్లకు అప్పగిస్తుంది. మర్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉదయం 9 గంటలకు వీటి పంపిణీని లాంఛనంగా ఆరంభిస్తామని సర్కిల్-1 ఏఎస్‌ఓ శ్రీహరి తెలిపారు. కంచరపాలెం, మురళీనగర్, కైలాసపురం, మాధవధార పరిధిలోని 185 మంది డీలర్లకు కొత్త మెషీన్లు అందిస్తారు. వారి వద్ద ఉన్న పాత యంత్ర పరికరాలను తొలుత అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఇటీవల ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ కార్డులపై ఉండే బార్‌కోడ్‌ను స్కాన్ చేసి సరుకులు అందించేందుకు వీలుగా సరికొత్త యంత్రాలు ఉపయోగపడతాయి.

ఆత్మహత్య ఆలోచనను తరిమికొట్టాలి

»పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

కంచరపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య ఆలోచనను తరిమికొట్టి ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టరు శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు.కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో బుధవారం నిర్వహించిన ఆత్మహత్య నివారణపై అవగాహన కార్యక్రమంలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యక్తిగత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఆత్మహత్య నివారణ సంకేతాలను అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానసిక న్యాయ సలహాదారు, రచయిత డాక్టరు పూజిత జోస్యుల 'సూసైడ్ ప్రివెన్షన్ అవుట్ రిచ్ & లైఫ్ సేవర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టరు పూజిత మాట్లాడుతూ ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడేందుకు ఈ పుస్తకం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆత్మహత్య ఆలోచన బాధితులపై బంధువులు, స్నేహితులు, తల్లిదండ్రుల పాత్రను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టరు బి.మురళీధర రావు, సీనియర్ అధ్యాపకుడు ఎస్.వి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసికంగా కుంగినవారిని స్నేహభావంతో ఆదరించాలి

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల ఉదంతాలు దిగ్భ్రాంతి గొలుపుతున్నాయని, మానసికంగా కుంగిన వారిని స్నేహభావంతో ఆదరిస్తూ, వారిలో మనోధైర్యం నింపాలని మానసిక వైద్యులు డాక్టర్ నిహాల్, ప్రభుత్వ మానసిక వైద్యశాల విశ్రాంత పర్యవేక్షకుడు డాక్టర్ ఎస్ఎన్ రాజులు సూచించారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో కౌసల్య కౌన్సెలింగ్ కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మహత్యల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయడం బాధ్యతగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అతిథులు సూచించారు. పరీక్షలు తప్పడం, ప్రేమవిఫలం కావడం, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాల సేవనం, మానసిక అనారోగ్యం ఆత్మహత్యలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. అటువంటి వారికి కౌన్సెలింగ్, మందులు, ఇతర ప్రక్రియల ద్వారా నయం చేయవచ్చన్నారు. కౌసల్య కౌన్సెలింగ్ కేంద్రం ప్రతినిధులు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.



డాక్టరు పూజితను సత్కరిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.ఎన్.రాజు











సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల స్నాతకోత్సవం

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల 22వ స్నాతకోత్సవం పౌరగ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ విద్యలో తర్ఫీదు పొందిన వారికి డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ కేవీఎన్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ థియాలజీలో పలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు బోర్డు మెంబర్ రెవరెండ్ ఆచార్య బి.రత్నప్రభాకర్ పట్టాలు, పరిశోధకులకు డాక్టరేట్లు అందజేశారు. పలువురు బిషప్‌లు, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రత్నప్రభాకర్

మహిళా కళాశాలలో టాలెంట్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల స్వర్ణోత్సవాలలో భాగంగా టాలెంట్ ఫ్యూజన్-స్కిల్ ఫర్ ద ఫ్యూచర్ పేరుతో బుధవారం విద్యార్థినులకు డ్రాయింగ్, పెయింటింగ్, శారీ డ్రేపింగ్, మేకప్, హ్యాండ్ రైటింగ్, సుడోకు, క్రాఫ్ట్, ఫొటోగ్రఫీ, నెయిల్ ఆర్ట్ వంటి వాటిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు నైపుణ్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కళల్లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎం.ఎ.నివేదిత ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో తులసి, కదంబ, కొబ్బరి, తురాయి, సీతాఫలం, సపోట తదితర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ కె.ఎల్.శిరీష, డాక్టర్ అనురాధ, డాక్టర్ బి.హైమావతి, డాక్టర్ ధరణి పాల్గొన్నారు.

దుర్గాగణపతి ఆలయంలో 9 వేల మందికి అన్నదానం

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలో గల దుర్గాగణపతి ఆలయంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, సతీష్ కుమార్ ఆర్య, పి.మధు, టి.వి. శ్రీకాంత్‌లు ముందుగా సాధువులకు వడ్డించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా సుమారు 9 వేల మంది ప్రసాదం స్వీకరించారని ఆలయ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.


సాధువులకు వడ్డిస్తున్న అతిథులు

కొబ్బరితోటలో వెండి వినాయక ప్రతిమల పంపిణీ

అల్లిపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల్లో భాగంగా 34వ వార్డు కొబ్బరితోటలో క్రేజీ బాయ్స్ బుధవారం ఏర్పాటు చేసిన అన్నదానం అందరినీ అబ్బురపరిచింది. వచ్చిన ప్రతి భక్తునికి 60 రకాలతో వడ్డించారు. ఇందులో 2 లీటర్ల శీతల పానీయం, లస్సీలు, జ్యూస్‌లు, వివిధ రకాల స్వీట్లు పెట్టారు. అనంతరం ప్రతి భక్తునికి వెండి వినాయక ప్రతిమను అందచేశారు. .వందలాది మందితో అన్నదాన ప్రాంగణం కిక్కిరిసింది. ఏటా ఇదే విధంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహక సభ్యులు వినోద్, భాను, రాజేష్ అన్నారు.

తిరుమల జాపాలి ఆంజనేయస్వామికి వెండి పళ్లెం, హారం


వెండి పళ్ళెం, హారం చూపిస్తున్న మహిళలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కలియుగంలో భగవన్నామ స్మరణే మోక్షమార్గమని వేంకటకృష్ణ అన్నమాచార్య సంస్థ అధ్యక్షురాలు సింగంపల్లి వెంకట విజయలక్ష్మి అన్నారు. రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో బుధవారం సంస్థ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుందరకాండ పాడి తద్వారా వచ్చే విరాళాలతో తిరుమల కొండపై ఉన్న జాపాలి ఆంజనేయస్వామికి వచ్చే నెల కిలోన్నర వెండి పళ్ళెం, 108 తమలపాకులు 12 అడుగుల వెండి హారాన్ని సమర్పించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆరు ఆలయాల్లో సుందరకాండ ఆలపించి తద్వారా వచ్చిన విరాళాలు సమర్పించామని పేర్కొన్నారు. అమెరికాలో కూడా సుందరకాండ ఆలపించామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో దుర్గా నవరాత్రుల రాట ఉత్సవం

సీతమ్మధార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ సమీపంలో గల మైదానంలో లక్కీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు గుప్తజీ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవ రాట పూజ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, మహిళలు విచ్చేసి అమ్మవారి రాట వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రాట ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ పద్మారెడ్డి, శ్యామల దీపిక, నిర్వాహక ప్రతినిధులు

జగన్ మళ్లీ సీఎం కాలేడు: చింతా మోహన్

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కాలేడని, కేసులు మాఫీ చేయించుకుని కుటుంబంతో గడపడం మంచిదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. నగరంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా కొడుకును బిలియనీర్‌ను చేశాడన్నారు. జగన్ సీఎం అయిన తరువాత లిక్కర్ కుంభకోణం చేసి మరింత సంపాదించాడని ఆరోపించారు. మళ్లీ సీఎం కావాలన్న ఉద్దేశంతో ఆకుపచ్చ కండువాలు వేసుకుని రైతుపోరు పేరుతో ఆందోళనలు చేస్తున్నారని, కానీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకుంటే కూటమి నుంచి చంద్రబాబునాయుడు బయటకు రావాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జిలకు దళితుల సమస్యలు తెలియవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో పారదర్శకత లేదని, సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 111 స్థానాల్లో గడిచిన ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

డాబాగార్డెన్స్: రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో బుధవారం సాయంత్రం చింతా మోహన్ పాల్గొన్నారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్‌లో పాదయాత్ర చేపట్టి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చింతామోహన్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందన్నారు. దళితుల హక్కులను కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, దాసరి చెన్న కేశవులు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ కేటగిరీని వర్తింపజేయాలన్నారు. క్రీమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, అంబేడ్కర్, సూర్యారావు, ప్రకాష్, శరత్‌బాబు, నాగమల్లీశ్వరి, చింతయ్య, వెంకట్రావు, చిన్నారావులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తదితరులు

తూతూమంత్రంగా విచారణ

... 5వ పేజీ తరువాయి

ఫోన్ల ద్వారా చెప్పినట్టు తెలిసింది. దీనిని బట్టి తూతూమంత్రంగా విచారణ ముగిస్తున్నట్టుగా అర్థమవుతోంది.

30 ఏళ్ల సర్వీసులో వెండి గ్లాసు చూడలేదట

సింహాచలంలో సిరి గల్లంతు కథనంపై అర్చకుల్లో ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. స్వామిపూజలకు ఉపయోగించే వస్తువులు ఆలయంలోనే ఉంటాయని, ఎవరైనా అర్చకులు పదవీ విరమణ చేస్తే వాటిని భౌతికంగా తరువాత వచ్చే అర్చకులకు అప్పగించడమే ఆనవాయితీగా వస్తోందని, లెక్కలు చూసి తీసుకోవడం తన 30 ఏళ్ల సర్వీసులో ఎప్పుడూ చూడలేదని ఆయన వివరించారు. పూజాసామగ్రిలో మొదట వెండి గ్లాసు పేరు రిజిస్టర్‌లో ఉంటుందని, అయితే ఎప్పుడూ దాన్ని తాను చూడలేదని సదరు అర్చకుడు చెప్పడం గమనార్హం. అంటే...దేవస్థానంలో పుస్తకాలలో లెక్కలకు, వాస్తవంగా ఉండే వస్తువులకు పొంతన ఉండదని అర్థమవుతోంది. అధికారులు మాత్రం తనిఖీలు, విచారణ అంటూ మసి పూసి మారేడు కాయ చేసి మోసం చేస్తున్నారు.

కరాసలో దొంగల హల్‌చల్!

» ఐదిళ్లలో వరుస చోరీలు » 21 తులాల బంగారం, 220 తులాల వెండి అపహరణ


చోరీ జరిగిన ఓ ఇంట్లో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

మాధవధార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఏడీ కొత్తరోడ్డు దగ్గర కరాసలో బుధవారం దొంగలు హల్‌చల్ సృష్టించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడ్డారు. ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్‌స్టేషన్ నేర విభాగం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 52వ వార్డు కరాసలో పలు ఇళ్లల్లో ఒకే రోజు జరిగిన దొంగతనాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. వరుసగా ఒక్క రాత్రిలో (మంగళవారం అర్ధరాత్రి దాటాక, బుధవారం తెల్లవారు సమయంలో) 5 ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇందులో నాలుగు ఇళ్లలో సుమారు 11 తులాల బంగారం, రూ.15 వేల నగదుతో పాటు 20 తులాల వెండిని దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరాసలోనే ప్రియాంక కాలనీలో ఏసుబాబు, దేవి సప్లయర్స్ నిర్వాహకులు శ్రీను ఇంట్లో సహా రామాలయం వీధి అభీష్, దంపతులవారి వీధిలో పద్మ, భేరి వీధిలో శ్రీను అనే వ్యక్తుల ఇళ్లల్లో చోరీ ఘటనలు జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ఒక ఇంట్లో 22 గ్రాముల బంగారం, మరొకరి వద్ద రూ.15 వేల నగదు, 200 తులాల వెండి, మరో ఇంట్లో ఎనిమిదిన్నర తులాల బంగారం పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘటనా స్థలానికి పోలీసు అధికారులు

వరుస దొంగతనాల సమాచారం మేరకు కరాస ప్రాంతానికి చేరుకున్న డీసీపీ లతా మాధురి, వెస్ట్ సబ్‌డివిజన్ క్రైమ్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, సీసీఎస్ విభాగం సీఐలు కె.రామారావు, చంద్రశేఖర్‌లు ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయంతో వేలిముద్రలు తీసుకున్నారు. దొంగల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. సీసీ కెమేరాల ఏర్పాటు ఆవశ్యకతను స్థానికులకు తెలియజెప్పారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

కామాఖ్య-బెంగళూరు (12552), పూరి-బెంగళూరు గరీబ్‌రథ్ (22883), హౌరా-బెంగళూరు దురంతో (12245), అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504) ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. ప్రతి శుక్రవారం అందుబాటులో ఉండే టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111)లో కూడా అక్టోబరు 31 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి. చెన్నై వెళ్లే మెయిల్ (12839), బొకారో (13351), టాటా-ఎర్నాకులం (18189) వంటి రెగ్యులర్ రైళ్లలో అక్టోబరు 16 వరకూ బెర్తులు నిండిపోయాయి. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841)లో అక్టోబరు 18 వరకు బెర్తులు నిండినా, కొన్ని తేదీల్లో ఏసీ బెర్తులు లభించే పరిస్థితి ఉంది. భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), షాలిమార్-త్రివేండ్రం (22642), గువాహటి-బెంగళూరు (12510), హౌరా-తిరుచిరాపల్లి ((12660), ముజఫర్‌పూర్-యశ్వంతపూర్ (15228), సంత్రాగచ్చి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ (22807), న్యూజలపాయ్‌గురి-మద్రాసు (22616) వంటి వీక్లీ, బై వీక్లీ రైళ్లకు డిమాండ్ నెలకొంది. విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు (22801) అక్టోబరు 17 వరకు ఫుల్ అయిపోయాయి.

సికింద్రాబాద్ రైళ్లకు అందుబాటులో బెర్తులు

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), గరీబ్‌రథ్ (12739), కోణార్క్ (11020), ఫలక్‌నుమా (12703), వందేభారత్ (20833), విశాఖ-నాందేడ్ (20811), ఎల్‌టీటీ (18519), దురంతో (22203) వంటి ప్రధాన రైళ్లకు దసరా రద్దీ అంతగా కనిపించలేదు. దాదాపు అన్ని రైళ్లకు బెర్తులు లభించే పరిస్థితి ఉంది. గోదావరి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్ , వందేభారత్, జన్మభూమి వంటి రైళ్లకు ఈ నెల 18 నుంచి ఖాళీలు ఉన్నాయి.

నేపాల్‌లో చిక్కుకున్న నగరవాసులు

... 5వ పేజీ తరువాయి

హోటల్ కూడా ఉంది. పాస్‌పోర్టులు తప్ప వారు తీసుకువెళ్లిన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. వారిని లేక్‌సైడ్ ప్రాంతంలో ఉన్న మరో హోటల్‌కు తరలించారు. అక్కడ నుంచి కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయంలో జ్యోతి అనే అధికారిని సంప్రతించగా, హోటల్‌లోనే ఉండాలని సూచించినట్టు సూర్యప్రభ బుధవారం సాయంత్రం ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. నేపాల్‌లో తమతోపాటు రాష్ట్రానికి చెందినవారు మరికొంతమంది ఉన్నారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నామని వివరించారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని సొంతూళ్లకు తీసుకురావడానికి ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేస్తున్నదన్నారు. తమతో మంత్రి నారా లోకేశ్ మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. గురువారం ఉదయం పోఖారా నుంచి హెలికాప్టర్‌లో కాఠ్మాండూకు తరలించి అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం ఢిల్లీ తీసుకువెళ్లడానికి ఏర్పాట్లుచేశారన్నారు. కళ్లముందు జరుగుతున్న అల్లర్లు చూసి భయమేసిందని, తమతోపాటు ఎంతోమంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు.

హోటళ్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

హోటళ్ల ధోరణిలో మార్పు మొదలైనట్టు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ వస్తుండడంతో అదనంగా మరో 16 బృందాలను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు.

స్టార్ హోటల్‌లో చేదు అనుభవం ఎదురైంది

నేను కుటుంబంతో కలిసి నగరంలోని ఒక స్టార్ హోటల్‌కు వెళ్లాను. అక్కడ టీ తాగేందుకు కంటెయినర్ వద్దకు వెళ్లాను. గాజు కంటెయినర్ లోపల టీ పొడి చుట్టూ ఫంగస్ పేరుకుపోయి కనిపించింది. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి నమూనాలు సేకరించి పరీక్ష చేయించాను. అక్కడున్న టీపొడిలో రంగు కలిపినట్టు పరీక్షలో తేలింది. ఆ హోటల్‌లో ఆహార పరిస్థితి కూడా అలాగే కనిపించింది. అలాగే గాజువాక జోన్‌లో పనిచేసే ఒక అధికారి నిత్యం బిర్యానీ తీసుకువెళ్లే ఒక హోటల్‌లో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన చికెన్, నాణ్యత లేని మసాలా, రుచికోసం రసాయనాలు వినియోగించినట్టు తేలింది. కల్తీ, మితిమీరిన రసాయనాలు కలిపిన ఆహారం తినడం వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. స్టార్‌హోటళ్లలో కూడా అదే పరిస్థితి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అలాంటి వాటిని కూడా ఉపేక్షించేది లేదు. -జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

మళ్లీ 12 గంటల డ్యూటీ

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తామని వారు వాపోతున్నారు.

ఇదిలావుంటే ఆగస్టు నెల జీతాలు సెప్టెంబరు 10వ తేదీ వచ్చినా ఇంతవరకూ ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. ఇప్పటికే మూడు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయి. ఇలాగైతే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని వారు వాపోతున్నారు. కేంద్రం హామీ ఇచ్చిన ఆర్థిక సాయంలో భాగంగా మంగళవారం రాత్రి రూ.840 కోట్లు స్టీల్ ప్లాంటు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. రూ.60 కోట్లు విడుదల చేస్తే ఉద్యోగులకు జీతాలు ఇవ్వవచ్చు. కానీ యాజమాన్యం దానికి ఒప్పుకోవడం లేదు. జీతాలు ఇవ్వకుండా పనిభారం మోపుతోంది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో ఒకచోట కన్వేయర్ బెల్ట్ తెగిపోయిందని, దానిపై అనుమానాలు ఉన్నాయని యాజమాన్యం తరఫున స్టీల్ ప్లాంటు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వాస్తవానికి ఆర్ఎంహెచ్‌పీలో సమస్యలు ఉన్నాయని అధికార వర్గాలు ముందు నుంచి చెబుతున్నాయి. యాజమాన్యం వాటిని పెడచెవిన పెట్టింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఉత్పత్తి లేకపోవడంతో ఆ నెపాన్ని కార్మికుల మీదకు నెట్టేయడానికి, కన్వేయరు బెల్ట్ ఎవరో కోసేశారని ఫిర్యాదు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది సరైన విధానం కాదని, సంస్థ ఆస్తులకు నష్టం చేసే ఆలోచన కలిగిన కార్మికులు, ఉద్యోగులు లేరని సంఘాల నాయకులు చెబుతున్నారు.

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు

... 5వ పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారన్నారు. దీనివల్ల సర్వేయర్లు చేతివాటానికి, అవినీతికి అడ్డుకట్టపడడంతోపాటు ప్రభుత్వ భూములు పరిరక్షణ, గెడ్డల ఆక్రమణకు అడ్డుకట్టపడుతుందన్నారు.

నగరంలో రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ ఏడాదికాలంలో అభివృద్ధి చేసేందుకు 112 రహదారులను (ప్రతి వార్డులో కనీసం ఒక రోడ్డునైనా) ఎంపిక చేశామన్నారు. అలాగే నగరంలో 16 ప్రధాన కూడళ్లను ఆధునికీకరించాలని నిర్ణయించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నగరంలో సీసీ, బీటీ రోడ్ల కోసం రూ.250 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. టీడీఆర్ బాండ్ల జారీని పారదర్శకంగానే చేస్తున్నామని, ప్రస్తుతం 450కిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నగరంలో గెడ్డలు, వరదనీటి కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నగరంలో 23 డ్రైన్‌ల ద్వారా మురుగునీరు సముద్రంలో కలుస్తున్నదని, వాటిని కొత్తగా నిర్మించబోయే నాలుగు పంప్‌హౌస్‌ల ద్వారా అప్పుఘర్, సాగర్‌నగర్, భీమిలిల్లో కొత్తగా నిర్మించే ఎస్‌టీపీలకు మళ్లిస్తామన్నారు.

నగరంలో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చితో కలిసి కార్యాచరణ అమలుచేస్తున్నామన్నారు. 115 ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను స్మార్ట్ సిగ్నల్స్‌గా అభివృద్ధి చేయడంతో పాటు జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన మార్గాల్లోని 56 ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నల్ సింక్రనైజేషన్ చేయబోతున్నామన్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రెండు సంస్థలకు రెండేసి సిగ్నల్ పాయింట్లను కేటాయించామని, అక్కడి ఫలితాల ఆధారంగా మిగిలిన జంక్షన్లలో కూడా అదే తరహా సదుపాయం ఏర్పాటుచేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ఈనెలలోనే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలుస్తామన్నారు. ఒకచోట గ్రీన్‌సిగ్నల్ లభిస్తే తర్వాత సిగ్నల్ వద్దకు వెళ్లేసరికి అక్కడ కూడా గ్రీన్ సిగ్నల్ ఉంటుందన్నారు. దీనివల్ల వాహనదారులు ప్రతి జంక్షన్‌లో ఆగాల్సిన అవసరం ఉండదు కాబట్టి ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. 'బ్లూమ్‌బర్గ్ మేయర్స్ ఛాలెంజ్-2025'కు ప్రపంచవ్యాప్తంగా 50 నగరాలు ఎంపికైతే అందులో జీవీఎంసీకి చోటు దక్కడం నగరవాసులకు గర్వకారణమన్నారు. పట్టణ ప్రాంతంలో సమస్యల పరిష్కారాన్ని ప్రజలే గుర్తించడం కోసం జీవీఎంసీ 'వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వి-పీయూఎల్ఎల్) మోడల్‌ను పైలట్ ప్రాజెక్టుగా 19వ వార్డు పరిధిలోని గణేష్‌నగర్‌లోనూ, 44వ వార్డు పరిధిని ఎంపిక చేసి కార్యక్రమాలు అమలుచేస్తుండడంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు జీవీఎంసీ అందించే సేవలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేయడంతోపాటు వారే సమస్యలకు పరిష్కారం సూచించేలా కృషిచేస్తున్నామన్నారు.

స్నేహితుడి కారుతో పరారీ

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అవసరం ఉందంటూ కారు తీసుకున్న స్నేహితుడు తర్వాత వాహనంతో సహా పరారవడంతో బాధితుడు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మార్కెట్‌లో ఉంటున్న మేరుగు విజయ్‌కుమార్ 2021, జూలై 10న తన స్నేహితుడైన సతీష్‌ను కలవడానికి ఉషోదయ కూడలి వద్దకు వచ్చాడు. అక్కడ సతీష్ తన స్నేహితుడంటూ అజ్జూబాయ్‌ని పరిచయం చేశాడు. అజ్జుబాయ్ తల్లి కాకినాడలోని ఓ ఆస్పత్రిలో ఉందంటూ విజయ్‌కుమార్‌కు చెప్పి, ఒకసారి కారుఇవ్వాల్సిందిగా సతీశ్ కోరాడు. అతడిపై నమ్మకంతో విజయ్‌కుమార్ కారును ఇచ్చారు. అయితే రోజులు గడిచినా కారు తిరిగి ఇవ్వలేదు. కొన్ని నెలల తర్వాత సతీష్ కూడా తనఇంటిని ఖాళీ చేసి పరారయ్యాడు.తాజాగా విజయ్‌కుమార్ ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తుచేస్తున్నారు.

ఇదేనా సుందరీకరణ?

- ముఖ్య ప్రాంతాలు, కూడళ్లకే స్మార్ట్ పనులు పరిమితం
- పలు చోట్ల అధ్వానంగా పరిసరాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహా నగర పాలక సంస్థ నగర సుందరీకరణకు



డివైడర్లపై విరిగిన గ్రిల్స్

రూ.కోట్లు ఖర్చు వెచ్చిస్తోంది. కానీ ప్రధాన ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో చెత్తకుప్పలు, వ్యర్థాలతో నిండి అధ్వానంగా ఉన్నా, కనీసం అటు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్ సిటీ నిధులతో ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లను రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. ఇటీవల టీటీడీ కూడలిని శంకుచక్రనామాలతో అందంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీప కాంతులతో పాటు, వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేసి, ఆ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిదారు. కానీ ఇదే ప్రాంతంలోని కూలవేటు దూరంలో అధ్వానంగా ఉన్న డివైడర్లను పట్టించుకోకపోవడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. డివైడర్ల ఇనుప గ్రిల్స్ విరిగిపోయి, మధ్యలో మొక్కలు ఎండిపోయి, అందులో వ్యర్థ తీగెలు ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఈ



ఎంవీపీ కూడలిలో డివైడర్ల మధ్య నిర్లక్ష్యంగా పడి ఉన్న కేబుల్ తీగలు

ప్రాంతం అధ్వానంగా కనిపిస్తోంది. ఓ ప్రాంతంలోనే అభివృద్ధి చేపట్టి దానినే సుందరీకరణ అంటే ఎలా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధ్వానంగా ఉన్న అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో డివైడర్ల మధ్య పేరుకు పోయిన చెత్తాచెదారాలు, పనికి రాని ఇనుప ఊచలను తొలగించాలని కోరుతున్నారు.

సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

సిరిపురం సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంకట హర చతుర్థి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మోహన్ స్వామి ఆధ్వర్యంలో నగరంలోని ఆశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి విశేష హోమం చేశారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సంకట హర చతుర్థి నాడు సంపత్ వినాయకుడికి గరిక సమర్పిస్తే, కోరిక కోర్కెలు తీరుతాయనే ప్రగాఢ నమ్మకంతో తెల్లవారి జాము నుంచే స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉపవాసం ఆచరించిన భక్తులు సాయంత్రం స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లను ఆలయ



పూజలు అందుకుంటున్న సంపత్ వినాయగర్ స్వామి

వ్యవస్థాపక కుటుంబ సభ్యులు టి.రాజేశ్వరన్ చోళన్, ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ కమిషనర్‌నే ఏమార్చారు!

- క్షేత్ర పర్యటనలో ఆక్రమణలపై దృష్టి సారించకుండా జాగ్రత్తలు
- జోన్-3 అధికారుల మాయాజాలం



కృష్ణ మందిరం పక్కన్న కాలువలను మూసేసి ఆక్రమణలు



వర్షం పడితే చిత్తడిగా మారుతున్న మార్గం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు జోన్3 అధికారులు, సిబ్బంది మసిబూసి మారేడుకాయ చేశారు. మంగళవారం జోన్-3 పరిధిలోని 16వ వార్డులోని ఇసుకతోట కృష్ణ మందిరం ప్రాంతంలో పర్యటించిన ఆయనకు పక్కనే ఉన్న ఆక్రమణ, సమస్య మార్గాన్ని చూపించకుండా దాటవేశారు. కృష్ణ మందిర్ మార్గంలో బడాబాబులు కాలువలను మూసేసి మరి కార్యకలాపాలు చేస్తున్నా అటు వైపు కమిషనర్ కన్నెత్తి చూడకుండా జోన్-3 అధికారులు జాగ్రత్త వహించారు. కేవలం ప్రధాన మార్గంలోనే గెడ్డను పరిశీలించడం, చిరు వ్యాపారులపై అపరాధ రుసుం విధించడం, ఆ మార్గంలోనే పర్యటించి వెళ్లిపోయేలా జోన్-3 బృందం తమ చాకచక్యాన్ని ప్రదర్శించారు. కేవలం ప్రధాన మార్గంలోనే పర్యటించిన కమిషనర్ కృష్ణమందిర్ పక్క మార్గంలోకి ఎక్కడ వెళతారో, తమ అసమర్థ చర్యలు ఎక్కడ బయటపడతాయోనని బిక్కుబిక్కుమంటూ ఆయన ఉన్నంత సేపూ ఆందోళనకు గురయ్యారు. ప్రధాన మార్గానికి ఆనుకుని ఉన్న ఈ మార్గమంతా పూర్తిగా కాలువలు మూసేసి బహుళ అంతస్తుల నిర్మాణం, కార్ల పార్కింగ్ చేయడం వల్ల కాస్త పెద్ద వర్షం పడితే చాలుఈ మార్గమంతా బురదమయంగా మారుతుంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి స్థానికులు తీసుకురాకుండా జోన్-3 అధికార బృందం చాకచక్యంగా నడుచుకున్నారు.

12, 13 వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో రూ.1.19 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. వెన్ని దుర్గానగర్‌లో రోడ్డుల, డ్రైనేజీల నిర్మాణాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండా ధర్మారావు, కార్యదర్శి సురేష్, తెలుగు మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి, బాలస్వామి, టీడీపీ బీసీ సెల్ వార్డు అధ్యక్షుడు వడిసెల శ్రీను, సీనియర్ నాయకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



వెన్ని దుర్గానగర్‌లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

అలాగే 12వ వార్డులోని పెదగదిలి శివాలయం వీధిలో గల కొండవాలులో సుమారు 63.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు కాలువ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ కొండవాలు ప్రాంతంలో ఇప్పటికే రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తి చేశామని, అలాగే యూజీడీ పనులు కూడా ఈ వారంలో ప్రారంభిస్తామని తెలిపారు ఇంకా ఏవైనా పెండింగ్ పనులు ఉంటే ప్రతిపాదనలు రూపొందించిన పంపాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, డీఈ వెంకటరావు, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, 12వ వారు కార్యదర్శి పోతిన భరత్, దువ్వి సంతోష్, అనంద్ పాల్గొన్నారు.

సేవా సంస్థకు రూ.3 లక్షల విరాళం

మురళీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫార్మజెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించే టచ్ స్టోన్ చారిటీస్ ఆర్గనైజేషన్‌కు బుధవారం రూ.3 లక్షల విరాళాన్ని అందించింది. సీఎస్ఆర్ నిధులతో వంట సామగ్రిని సమకూర్చారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని టచ్ స్టోన్ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫార్మజెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ అనంత్ దత్తాత్రేయ ఈ మొత్తాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం భోజన సదుపాయం కల్పిస్తున్న టచ్ స్టోన్ సంస్థకు ఉపయోగపడే విధంగా వంట సామగ్రి సమకూర్చామన్నారు. హెచ్ఆర్ మేనేజర్ అప్పారావు పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి

- ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఫెడరేషన్ నేతలు, సభ్యులు

సిరిపురం సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం అమలుతో ఆదాయం కోల్పోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రహమాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేస్తుండటంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 21, 31 వల్ల ఆటో, క్యాబ్ డ్రైవర్లపై వేస్తున్న అపరాధ రుసుం వారికి తీవ్ర భారంగా మారిందన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.5 వేల ఆర్థిక సా యం అందించాలన్నారు.ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు చెల్లించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రదర్శనగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, ప్రతినిధులు సాయికుమార్, నాగేశ్వరరావు, రాంబాబు, బుజ్జిబాబు, అప్పలరాజు, అన్నాజీ పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్ల చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్‌పై ప్రచారం చేస్తున్న ఆటో కార్మికులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే ఆటో డ్రైవర్ల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం 15, 16వ వారుల్లోని ఆటో స్టాండ్‌ల వద్ద యూనియన్ తరఫున ఆటో కార్మికులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో ఫెడరేషన్ 15, 16వ వార్డుల అధ్యక్షుడు ఎస్.మధురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆదాయ కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ఆదుకోవాలని కోరారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఫెడరేషన్ నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో చేపడుతున్నట్టు చెప్పారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఉన్న ఓ బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎంవీపీ కాలనీ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీపాలేనికి చెందిన కె.నారాయణరావు(25) మంగళవారం మధ్యాహ్నం ఇసుకతోట కృష్ణా కళాశాల సమీపంలో మూత్ర విసర్జన చేస్తుండగా, అతి వేగంగా బైక్‌పై వచ్చిన వ్యక్తి, అతడిని ఢీకొట్టి పరారయ్యాడు.

ఈ ప్రమాదంలో నారాయణరావుకు శరీరంపై పలు గాయాలతో పాటు కాలు విరిగిపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జలమయమైన పెదగదిలి కూడలి

- లోతట్టు ప్రాంతం కావడంతో నిలిచిపోయిన వరద నీరు
- వాహనదారులు, చిరు వ్యాపారుల అవస్థలు
- వర్షం వస్తే చాలు ముంచుకొస్తున్న సమస్య



పెదగదిలి రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఆరిలోవ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెదగదిలి, పరిసరాలు వరదనీటి మయమయ్యాయి. వర్షం దెబ్బకు చిరు వర్తకులు, ఫ్లాట్‌ఫారాలపై విక్రయాలు చేపట్టేవారు, కూరగాయల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఇది లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం నీరంతా నిలిచిపోయి చెరువును తలపించింది. చిన్నపాటి వర్షం కురిసినా ఈ ప్రాంతం వరద నీటితో మునిగిపోతుండడంతో వాహనదారులు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వచ్చిన ఇదే పరిస్థితి నెలకొంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హనుమంత వాక నుంచి సింహాచలం వెళ్లేందుకు ఈ మార్గమే ఆధారం. దీంతో ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వర్షం పడిన ప్రతిసారి ఈ విధంగా పెదగదిలి నీట మునిగిపోవడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం.

వర్షం పడినప్పుడు తొలువ చినగదిలి సాయిబాబాగుడి ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెదగదిలి జంక్షన్‌కు చేరుతుంది. ఈ నీటిని అక్కడ ఉన్న కాలువల్లోకి మళ్లిస్తే ఈ ఇబ్బందులు ఉండవని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు జీవీఎంసీ అధికారులకు విన్నవించామని, కానీ సమస్య మాత్రం ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెదగదిలి జంక్షన్ ముంపు నుంచి రక్షించాలని కోరుతున్నారు.



వర్షం నీరు చేరడంతో తోపుడుబండ్ల వ్యాపారుల అవస్థలు

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 16, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36,అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 44,కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు (బ్రాయిలర్)	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

'చెస్ టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ముదావహం'

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సహకారంతో అడుసుమిల్లి సురేష్, రత్తయ్యల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం ఆనందదాయకమని రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ప్రపంచ కప్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపికకు కీలకంగా నిలిచే జాతీయ చెస్ టోర్నీని విజయవంతం చేసేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలందించేందుకు ముందుకు రావడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న



రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, రత్తయ్య

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్ర సంఘం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు



వెంకోజీపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలకు, వీస్తున్న గాలులకు చెట్టు కొమ్మలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవతో బుధవారం అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగింపజేశారు. హార్టీకల్చర్ సిబ్బంది మెషిన్‌తో గుబురుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి ప్రమాదాలు జరగకుండా, పడిపోవడానికి సిద్ధంగా ఉన్న చెట్లను కూడా తొలగించి వేశారు. సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం, హెచ్‌బీ కాలనీలో ఈ చెట్టు కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

అంతర్ వర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నీకి ఏయూ ఆతిథ్యం

- స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య విజయ్‌మోహన్ వెల్లడి

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ టోర్నీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యమివ్వనుందని ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ తెలిపారు. ఏయూ పరిధిలోని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్ వర్సిటీ క్రికెట్ పోటీల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలందించాలని కోరారు. అలాగే ఈ నెల 25న ఏయూ విలువిద్య జట్టు, 25న యోగా పురుషుల జట్టు ఎంపికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది జరగాల్సిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఏయూ జట్లను ఎంపిక చేసేందుకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించాలన్నారు. ఏ



వివరాలు వెల్లడిస్తున్న విజయ్‌మోహన్

యూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రీడా కార్యకలాపాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, అక్కడ అనుమతులు లభించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఐదు జిల్లాల్లోని ఏయూ అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు నిబద్ధతతో పనిచేసి క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు శతాబ్ది క్రీడా పోటీలు విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పల్లవి, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ కిరణ్మయి,డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వాసు దేవరాజు, డాక్టర్‌టీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ఎస్.గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై ఇద్దరు అనుచిత ప్రవర్తన

- వాహనం నుంచి లాగి కింద పడేయడంతో కారు ఢీకొని తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవరు తాగి ఉన్నాడని, ఆటోలో నుంచి బయటకు లాగి రోడ్డుపై పడేశారు స్నేహితులు. వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శివాజీపాలెం ఆరు కొళాయిల జంక్షన్ సమీపంలో ఉంటున్న నాగళ్ల పోలయ్య మంగళవారం మధ్యాహ్నం తన ఆటోలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం మూడున్నరకు పోలయ్య భార్య జ్యోతికి ఓ వ్యక్తి ఫోన్ చేసి, పోలయ్య తాగి ఆటోలో నుంచి పడిపోయాడని, అతడి స్నేహితులు గొలగాని గోపాల్, దుర్గ కేజీహెచ్‌లో చేర్పించారని తెలిపాడు.

ఈ సంఘటనపై జ్యోతి వివరాలు తెలుసుకోవడంతో పాటు, శివాజీపాలెంలోని తాండ్రపాపారాయుడు ఫంక్షన్ హాలు సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా, ఆటోలో నుంచి పోలయ్యను గోపాల్, దుర్గ బయటకు లాగి, రోడ్డుపై పడేయడంతో, వేగంగా వచ్చిన ఏపీ 39 ఎఫ్‌క్యూ 4798 నెంబరుగల కారు పోలయ్య పై నుంచి వెళ్లిపోవడంతో చాతి, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.

ఈ సంఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్లకు సరికొత్త ఇ పోస్ మెషీన్ల పంపిణీ నేడు



మురళీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోలకు సరికొత్త ఇ పోస్ స్కానర్ మెషీన్లను గురువారం సరఫరా చేయనున్నారు. పౌరసరఫరాల శాఖ కంచరపాలెం సర్కిల్-1 పరిధిలో వీటిని డీలర్లకు అప్పగిస్తుంది. మద్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉదయం 9 గంటలకు వీటి పంపిణీని లాంచనంగా ఆరంభిస్తామని సర్కిల్-1 ఏఎస్ఓ శ్రీహరి తెలిపారు. కంచరపాలెం, మురళీనగర్, కైలాసపురం, మాధవధార పరిధిలోని 185 మంది డీలర్లకు కొత్త మెషీన్లు అందిస్తారు. వారి వద్ద ఉన్న పాత యంత్ర పరికరాలను తొలుత అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఇటీవల ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ కార్డులపై ఉండే బార్‌కోడ్‌ను స్కాన్ చేసి సరుకులు అందించేందుకు వీలుగా సరికొత్త యంత్రాలు ఉపయోగపడతాయి.

ఆత్మహత్య ఆలోచనను తరిమికొట్టాలి

» పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

కంచరపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య ఆలోచనను తరిమికొట్టి ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టరు శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు.కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో బుధవారం నిర్వహించిన ఆత్మహత్య నివారణపై అవగాహన కార్యక్రమంలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యక్తిగత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఆత్మహత్య నివారణ సంకేతాలను అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానసిక న్యాయ సలహాదారు, రచయిత డాక్టరు పూజిత జోస్యుల 'సూసైడ్ ప్రివెన్షన్ అవుట్ రిచ్ & లైఫ్ సేవర్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టరు పూజిత మాట్లాడుతూ ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడేందుకు ఈ పుస్తకం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆత్మహత్య ఆలోచన బాధితులపై బంధువులు, స్నేహితులు, తల్లిదండ్రుల పాత్రను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టరు బి.మురళీధర రావు, సీనియర్ అధ్యాపకుడు ఎస్.వి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసికంగా కుంగినవారిని స్నేహభావంతో ఆదరించాలి

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల ఉదంతాలు దిగ్భ్రాంతి గొలుపుతున్నాయని, మానసికంగా కుంగిన వారిని స్నేహభావంతో ఆదరిస్తూ, వారిలో మనోధైర్యం నింపాలని మానసిక వైద్యులు డాక్టర్ నిహాల్, ప్రభుత్వ మానసిక వైద్యశాల విశ్రాంత పర్యవేక్షకుడు డాక్టర్ ఎస్ఎస్ రాజులు సూచించారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో కౌసల్య కౌన్సెలింగ్ కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మహత్యల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయడం బాధ్యతగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అతిథులు సూచించారు. పరీక్షలు తప్పడం, ప్రేమవిఫలం కావడం, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాల సేవనం, మానసిక అనారోగ్యం ఆత్మహత్యలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. అటువంటి వారికి కౌన్సెలింగ్, మందులు, ఇతర ప్రక్రియల ద్వారా నయం చేయవచ్చన్నారు. కౌసల్య కౌన్సెలింగ్ కేంద్రం ప్రతినిధులు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.



డాక్టరు పూజితను సత్కరిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.ఎస్.రాజు

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

కామాఖ్య-బెంగళూరు (12552), పూరి-బెంగళూరు గరీబ్‌రథ్ (22883), హౌరా-బెంగళూరు దురంతో (12245), అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504) ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. ప్రతి శుక్రవారం అందుబాటులో ఉండే టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111)లో కూడా అక్టోబరు 31 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి. చెన్నై వెళ్లే మెయిల్ (12839), బొకారో (13351), టాటా-ఎర్నాకులం (18189) వంటి రెగ్యులర్ రైళ్లలో అక్టోబరు 16 వరకూ బెర్తులు నిండిపోయాయి. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841)లో అక్టోబరు 18 వరకు బెర్తులు నిండినా, కొన్ని తేదీల్లో ఏసీ బెర్తులు లభించే పరిస్థితి ఉంది. భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), షాలిమార్-త్రివేంద్రం (22642), గువాహటి-బెంగళూరు (12510), హౌరా-తిరుచిరాపల్లి ((12660), ముజఫర్‌పూర్-యశ్వంతపూర్ (15228), సంత్రాగచ్చి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ (22807), న్యూజలపాయ్‌గురి-మద్రాసు (22616) వంటి వీక్లీ, బై వీక్లీ రైళ్లకు డిమాండ్ నెలకొంది. విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు (22801) అక్టోబరు 17 వరకు ఫుల్ అయిపోయాయి.

సికింద్రాబాద్ రైళ్లకు అందుబాటులో బెర్తులు

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), గరీబ్‌రథ్ (12739), కోణార్క్ (11020), ఫలక్‌నుమా (12703), వందేభారత్ (20833), విశాఖ-నాందేడ్ (20811), ఎల్‌టీటీ (18519), దురంతో (22203) వంటి ప్రధాన రైళ్లకు దసరా రద్దీ అంతగా కనిపించలేదు. దాదాపు అన్ని రైళ్లకు బెర్తులు లభించే పరిస్థితి ఉంది. గోదావరి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్ , వందేభారత్, జన్మభూమి వంటి రైళ్లకు ఈ నెల 18 నుంచి ఖాళీలు ఉన్నాయి.

నేపాల్‌లో చిక్కుకున్న నగరవాసులు

... 5వ పేజీ తరువాయి

హోటల్ కూడా ఉంది. పాస్‌పోర్టులు తప్ప వారు తీసుకువెళ్లిన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. వారిని లేక్‌సైడ్ ప్రాంతంలో ఉన్న మరో హోటల్‌కు తరలించారు. అక్కడ నుంచి కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయంలో జ్యోతి అనే అధికారిని సంప్రతించగా, హోటల్‌లోనే ఉండాలని సూచించినట్టు సూర్యప్రభ బుధవారం సాయంత్రం ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. నేపాల్‌లో తమతోపాటు రాష్ట్రానికి చెందినవారు మరికొంతమంది ఉన్నారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నామని వివరించారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని సొంతూళ్లకు తీసుకురావడానికి ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేస్తున్నదన్నారు. తమతో మంత్రి నారా లోకేశ్ మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. గురువారం ఉదయం పోఖారా నుంచి హెలికాప్టర్‌లో కాఠ్మాండూకు తరలించి అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం ఢిల్లీ తీసుకువెళ్లడానికి ఏర్పాట్లుచేశారన్నారు. కళ్లముందు జరుగుతున్న అల్లర్లు చూసి భయమేసిందని, తమతోపాటు ఎంతోమంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు.

హోటళ్లకు చెక్


... 5వ పేజీ తరువాయి

హోటళ్ల ధోరణిలో మార్పు మొదలైనట్టు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ వస్తుండడంతో అదనంగా మరో 16 బృందాలను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు.

స్టార్ హోటల్‌లో చేదు అనుభవం ఎదురైంది

నేను కుటుంబంతో కలిసి నగరంలోని ఒక స్టార్ హోటల్‌కు వెళ్లాను. అక్కడ టీ తాగేందుకు కంటెయినర్ వద్దకు వెళ్లాను. గాజు కంటెయినర్ లోపల టీ పొడి చుట్టూ ఫంగస్ పేరుకుపోయి కనిపించింది. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి నమూనాలు సేకరించి పరీక్ష చేయించాను. అక్కడున్న టీపొడిలో రంగు కలిపినట్టు పరీక్షలో తేలింది. ఆ హోటల్‌లో ఆహార పరిస్థితి కూడా అలాగే కనిపించింది. అలాగే గాజువాక జోన్‌లో పనిచేసే ఒక అధికారి నిత్యం బిర్యానీ తీసుకువెళ్లే ఒక హోటల్‌లో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన చికెన్, నాణ్యత లేని మసాలా, రుచికోసం రసాయనాలు వినియోగించినట్టు తేలింది. కల్తీ, మితిమీరిన రసాయనాలు కలిపిన ఆహారం తినడం వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. స్టార్‌హోటళ్లలో కూడా అదే పరిస్థితి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అలాంటి వాటిని కూడా ఉపేక్షించేది లేదు. -జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

'చెస్ టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ముదావహం'



రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, రత్తయ్య

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సహకారంతో అడుసుమిల్లి సురేష్, రత్తయ్యల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం ఆనందదాయకమని రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ప్రపంచ కప్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపికకు కీలకంగా నిలిచే జాతీయ చెస్ టోర్నీని విజయవంతం చేసేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలందించేందుకు ముందుకు రావడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్ర సంఘం తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

అంతర్ వర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నీకి ఏయూ ఆతిథ్యం

» స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య విజయ్‌మోహన్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య విజయ్‌మోహన్

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ టోర్నీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యమివ్వనుందని ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ తెలిపారు. ఏయూ పరిధిలోని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్ వర్సిటీ క్రికెట్ పోటీల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలందించాలని కోరారు. అలాగే ఈ నెల 25న ఏయూ విలువిద్య జట్టు, 25న యోగా పురుషుల జట్టు ఎంపికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది జరగాల్సిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఏయూ జట్లను ఎంపిక చేసేందుకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించాలన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రీడా కార్యకలాపాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, అక్కడ అనుమతులు లభించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఐదు జిల్లాల్లోని ఏయూ అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు నిబద్ధతతో పనిచేసి క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు శతాబ్ది క్రీడా పోటీలు విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పల్లవి, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వాసుదేవరాజు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ ఎస్.గోపీకృష్ణ పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల స్నాతకోత్సవం

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల 22వ స్నాతకోత్సవం పౌరగ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ విద్యలో తర్ఫీదు పొందిన వారికి డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ కేవీఎన్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ థియాలజీలో పలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు బోర్డు మెంబర్ రెవరెండ్ ఆచార్య బి.రత్నప్రభాకర్ పట్టాలు, పరిశోధకులకు డాక్టరేట్లు అందజేశారు. పలువురు బిషప్‌లు, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రత్నప్రభాకర్

మహిళా కళాశాలలో టాలెంట్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల స్వర్ణోత్సవాలలో భాగంగా టాలెంట్ ఫ్యూజన్-స్కిల్ ఫర్ ద ఫ్యూచర్ పేరుతో బుధవారం విద్యార్థినులకు డ్రాయింగ్, పెయింటింగ్, శారీ డ్రేపింగ్, మేకప్, హ్యాండ్ రైటింగ్, సుడోకు, క్రాఫ్ట్, ఫొటోగ్రఫీ, నెయిల్ ఆర్ట్ వంటి వాటిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు నైపుణ్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కళల్లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎం.ఎ.నివేదిత ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో తులసి, కదంబ, కొబ్బరి, తురాయి, సీతాఫలం, సపోట తదితర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ కె.ఎల్.శిరీష, డాక్టర్ అనురాధ, డాక్టర్ బి.హైమావతి, డాక్టర్ ధరణి పాల్గొన్నారు.

దుర్గాగణపతి ఆలయంలో 9 వేల మందికి అన్నదానం

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలో గల దుర్గాగణపతి ఆలయంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, సతీష్ కుమార్ ఆర్య, పి.మధు, టి.వి. శ్రీకాంత్‌లు ముందుగా సాధువులకు వడ్డించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా సుమారు 9 వేల మంది ప్రసాదం స్వీకరించారని ఆలయ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.



సాధువులకు వడ్డిస్తున్న అతిథులు

కొబ్బరితోటలో వెండి వినాయక ప్రతిమల పంపిణీ

అల్లిపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల్లో భాగంగా 34వ వార్డు కొబ్బరితోటలో క్రేజీ బాయ్స్ బుధవారం ఏర్పాటు చేసిన అన్నదానం అందరినీ అబ్బురపరిచింది. వచ్చిన ప్రతి భక్తునికి 60 రకాలతో వడ్డించారు. ఇందులో 2 లీటర్ల శీతల పానీయం, లస్సీలు, జ్యూస్‌లు, వివిధ రకాల స్వీట్లు పెట్టారు. అనంతరం ప్రతి భక్తునికి వెండి వినాయక ప్రతిమను అందచేశారు. .వందలాది మందితో అన్నదాన ప్రాంగణం కిక్కిరిసింది. ఏటా ఇదే విధంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహక సభ్యులు వినోద్, భాను, రాజేష్ అన్నారు.

తిరుమల జాపాలి ఆంజనేయస్వామికి వెండి పళ్లెం, హారం



వెండి పళ్ళెం, హారం చూపిస్తున్న మహిళలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కలియుగంలో భగవన్నామ స్మరణే మోక్షమార్గమని వేంకటకృష్ణ అన్నమాచార్య సంస్థ అధ్యక్షురాలు సింగంపల్లి వెంకట విజయలక్ష్మి అన్నారు. రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో బుధవారం సంస్థ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుందరకాండ పాడి తద్వారా వచ్చే విరాళాలతో తిరుమల కొండపై ఉన్న జాపాలి ఆంజనేయస్వామికి వచ్చే నెల కిలోన్నర వెండి పళ్ళెం, 108 తమలపాకులు 12 అడుగుల వెండి హారాన్ని సమర్పించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆరు ఆలయాల్లో సుందరకాండ ఆలపించి తద్వారా వచ్చిన విరాళాలు సమర్పించామని పేర్కొన్నారు. అమెరికాలో కూడా సుందరకాండ ఆలపించామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో దుర్గా నవరాత్రుల రాట ఉత్సవం

సీతమ్మధార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ సమీపంలో గల మైదానంలో లక్కీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు గుప్తజీ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవ రాట పూజ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, మహిళలు విచ్చేసి అమ్మవారి రాట వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రాట ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ పద్మారెడ్డి, శ్యామల దీపిక, నిర్వాహక ప్రతినిధులు

జగన్ మళ్లీ సీఎం కాలేడు: చింతా మోహన్

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కాలేడని, కేసులు మాఫీ చేయించుకుని కుటుంబంతో గడపడం మంచిదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. నగరంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా కొడుకును బిలియనీర్‌ను చేశాడన్నారు. జగన్ సీఎం అయిన తరువాత లిక్కర్ కుంభకోణం చేసి మరింత సంపాదించాడని ఆరోపించారు. మళ్లీ సీఎం కావాలన్న ఉద్దేశంతో ఆకుపచ్చ కండువాలు వేసుకుని రైతుపోరు పేరుతో ఆందోళనలు చేస్తున్నారని, కానీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకుంటే కూటమి నుంచి చంద్రబాబునాయుడు బయటకు రావాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జిలకు దళితుల సమస్యలు తెలియవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో పారదర్శకత లేదని, సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 111 స్థానాల్లో గడిచిన ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

డాబాగార్డెన్స్: రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో బుధవారం సాయంత్రం చింతా మోహన్ పాల్గొన్నారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్‌లో పాదయాత్ర చేపట్టి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చింతామోహన్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందన్నారు. దళితుల హక్కులను కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, దాసరి చెన్న కేశవులు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ కేటగిరీని వర్తింపజేయాలన్నారు. క్రీమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, అంబేడ్కర్, సూర్యారావు, ప్రకాష్, శరత్‌బాబు, నాగమల్లీశ్వరి, చింతయ్య, వెంకట్రావు, చిన్నారావులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



కుమరస్వామిని సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తరగతి గదుల్లోనే భావిభారతం రూపొందుతుందని, దేశ భవిష్యత్తు బాలలను తయారు చేసేది ఉపాధ్యాయులేనని ఇస్లాంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయునాలు జి.ప్రమీల అన్నారు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు జి.కుమరస్వామిని స్కూల్‌లో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఏ విధంగ చదవాలో చెప్పి అందరి మన్ననలు పొందుతున్న వ్యక్తి కుమారస్వామి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందరావు, మూర్తి, రమాదేవి, హేమలత పాల్గొన్నారు.

తూతూమంత్రంగా విచారణ

... 5వ పేజీ తరువాయి

ఫోన్ల ద్వారా చెప్పినట్టు తెలిసింది. దీనిని బట్టి తూతూమంత్రంగా విచారణ ముగిస్తున్నట్టుగా అర్థమవుతోంది.

30 ఏళ్ల సర్వీసులో వెండి గ్లాసు చూడలేదట

సింహాచలంలో సిరి గల్లంతు కథనంపై అర్చకుల్లో ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. స్వామిపూజలకు ఉపయోగించే వస్తువులు ఆలయంలోనే ఉంటాయని, ఎవరైనా అర్చకులు పదవీ విరమణ చేస్తే వాటిని భౌతికంగా తరువాత వచ్చే అర్చకులకు అప్పగించడమే ఆనవాయితీగా వస్తోందని, లెక్కలు చూసి తీసుకోవడం తన 30 ఏళ్ల సర్వీసులో ఎప్పుడూ చూడలేదని ఆయన వివరించారు. పూజాసామగ్రిలో మొదట వెండి గ్లాసు పేరు రిజిస్టర్‌లో ఉంటుందని, అయితే ఎప్పుడూ దాన్ని తాను చూడలేదని సదరు అర్చకుడు చెప్పడం గమనార్హం. అంటే...దేవస్థానంలో పుస్తకాలలో లెక్కలకు, వాస్తవంగా ఉండే వస్తువులకు పొంతన ఉండదని అర్థమవుతోంది. అధికారులు మాత్రం తనిఖీలు, విచారణ అంటూ మసి పూసి మారేడు కాయ చేసి మోసం చేస్తున్నారు.

కరాసలో దొంగల హల్‌చల్!

» ఐదిళ్లలో వరుస చోరీలు » 21 తులాల బంగారం, 220 తులాల వెండి అపహరణ



చోరీ జరిగిన ఓ ఇంట్లో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

మాధవధార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఏడీ కొత్తరోడ్డు దగ్గర కరాసలో బుధవారం దొంగలు హల్‌చల్ సృష్టించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడ్డారు. ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్‌స్టేషన్ నేర విభాగం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 52వ వార్డు కరాసలో పలు ఇళ్లల్లో ఒకే రోజు జరిగిన దొంగతనాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. వరుసగా ఒక్క రాత్రిలో (మంగళవారం అర్ధరాత్రి దాటాక, బుధవారం తెల్లవారు సమయంలో) 5 ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇందులో నాలుగు ఇళ్లలో సుమారు 11 తులాల బంగారం, రూ.15 వేల నగదుతో పాటు 20 తులాల వెండిని దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరాసలోనే ప్రియాంక కాలనీలో ఏసుబాబు, దేవి సప్లయర్స్ నిర్వాహకులు శ్రీను ఇంట్లో సహా రామాలయం వీధి అభీష్, దంపతులవారి వీధిలో పద్మ, భేరి వీధిలో శ్రీను అనే వ్యక్తుల ఇళ్లల్లో చోరీ ఘటనలు జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ఒక ఇంట్లో 22 గ్రాముల బంగారం, మరొకరి వద్ద రూ.15 వేల నగదు, 200 తులాల వెండి, మరో ఇంట్లో ఎనిమిదిన్నర తులాల బంగారం పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘటనా స్థలానికి పోలీసు అధికారులు

వరుస దొంగతనాల సమాచారం మేరకు కరాస ప్రాంతానికి చేరుకున్న డీసీపీ లతా మాధురి, వెస్ట్ సబ్‌డివిజన్ క్రైమ్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, సీసీఎస్ విభాగం సీఐలు కె.రామారావు, చంద్రశేఖర్‌లు ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయంతో వేలిముద్రలు తీసుకున్నారు. దొంగల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. సీసీ కెమేరాల ఏర్పాటు ఆవశ్యకతను స్థానికులకు తెలియజెప్పారు.

మళ్లీ 12 గంటల డ్యూటీ

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తామని వారు వాపోతున్నారు.

ఇదిలావుంటే ఆగస్టు నెల జీతాలు సెప్టెంబరు 10వ తేదీ వచ్చినా ఇంతవరకూ ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. ఇప్పటికే మూడు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయి. ఇలాగైతే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని వారు వాపోతున్నారు. కేంద్రం హామీ ఇచ్చిన ఆర్థిక సాయంలో భాగంగా మంగళవారం రాత్రి రూ.840 కోట్లు స్టీల్ ప్లాంటు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. రూ.60 కోట్లు విడుదల చేస్తే ఉద్యోగులకు జీతాలు ఇవ్వవచ్చు. కానీ యాజమాన్యం దానికి ఒప్పుకోవడం లేదు. జీతాలు ఇవ్వకుండా పనిభారం మోపుతోంది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో ఒకచోట కన్వేయర్ బెల్ట్ తెగిపోయిందని, దానిపై అనుమానాలు ఉన్నాయని యాజమాన్యం తరఫున స్టీల్ ప్లాంటు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వాస్తవానికి ఆర్ఎంహెచ్‌పీలో సమస్యలు ఉన్నాయని అధికార వర్గాలు ముందు నుంచి చెబుతున్నాయి. యాజమాన్యం వాటిని పెడచెవిన పెట్టింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఉత్పత్తి లేకపోవడంతో ఆ నెపాన్ని కార్మికుల మీదకు నెట్టేయడానికి, కన్వేయరు బెల్ట్ ఎవరో కోసేశారని ఫిర్యాదు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది సరైన విధానం కాదని, సంస్థ ఆస్తులకు నష్టం చేసే ఆలోచన కలిగిన కార్మికులు, ఉద్యోగులు లేరని సంఘాల నాయకులు చెబుతున్నారు.

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు

... 5వ పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారన్నారు. దీనివల్ల సర్వేయర్ల చేతివాటానికి, అవినీతికి అడ్డుకట్టపడడంతోపాటు ప్రభుత్వ భూములు పరిరక్షణ, గెడ్డల ఆక్రమణకు అడ్డుకట్టపడుతుందన్నారు.

నగరంలో రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ ఏడాదికాలంలో అభివృద్ధి చేసేందుకు 112 రహదారులను (ప్రతి వార్డులో కనీసం ఒక రోడ్డునైనా) ఎంపిక చేశామన్నారు. అలాగే నగరంలో 16 ప్రధాన కూడళ్లను ఆధునికీకరించాలని నిర్ణయించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నగరంలో సీసీ, బీటీ రోడ్ల కోసం రూ.250 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. టీడీఆర్ బాండ్ల జారీని పారదర్శకంగానే చేస్తున్నామని, ప్రస్తుతం 450కిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నగరంలో గెడ్డలు, వరదనీటి కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నగరంలో 23 డ్రైన్‌ల ద్వారా మురుగునీరు సముద్రంలో కలుస్తున్నదని, వాటిని కొత్తగా నిర్మించబోయే నాలుగు పంప్‌హౌస్‌ల ద్వారా అప్పుఘర్, సాగర్‌నగర్, భీమిలిల్లో కొత్తగా నిర్మించే ఎస్‌టీపీలకు మళ్లిస్తామన్నారు.

నగరంలో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చితో కలిసి కార్యాచరణ అమలుచేస్తున్నామన్నారు. 115 ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను స్మార్ట్ సిగ్నల్స్‌గా అభివృద్ధి చేయడంతోపాటు జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన మార్గాల్లోని 56 ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నల్ సింక్రనైజేషన్ చేయబోతున్నామన్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రెండు సంస్థలకు రెండేసి సిగ్నల్ పాయింట్లను కేటాయించామని, అక్కడి ఫలితాల ఆధారంగా మిగిలిన జంక్షన్లలో కూడా అదే తరహా సదుపాయం ఏర్పాటుచేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ఈనెలలోనే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలుస్తామన్నారు. ఒకచోట గ్రీన్‌సిగ్నల్ లభిస్తే తర్వాత సిగ్నల్ వద్దకు వెళ్లేసరికి అక్కడ కూడా గ్రీన్ సిగ్నల్ ఉంటుందన్నారు. దీనివల్ల వాహనదారులు ప్రతి జంక్షన్‌లో ఆగాల్సిన అవసరం ఉండదు కాబట్టి ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. 'బ్లూమ్‌బర్గ్ మేయర్స్ ఛాలెంజ్-2025'కు ప్రపంచవ్యాప్తంగా 50 నగరాలు ఎంపికైతే అందులో జీవీఎంసీకి చోటు దక్కడం నగరవాసులకు గర్వకారణమన్నారు. పట్టణ ప్రాంతంలో సమస్యల పరిష్కారాన్ని ప్రజలే గుర్తించడం కోసం జీవీఎంసీ 'వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వి-పీయూఎల్ఎల్) మోడల్‌ను పైలట్ ప్రాజెక్టుగా 19వ వార్డు పరిధిలోని గణేష్‌నగర్‌లోనూ, 44వ వార్డు పరిధిని ఎంపిక చేసి కార్యక్రమాలు అమలుచేస్తుండడంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు జీవీఎంసీ అందించే సేవలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయడంతోపాటు వారే సమస్యలకు పరిష్కారం సూచించేలా కృషిచేస్తున్నామన్నారు.

స్టీల్ ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద స్వల్ప ఉద్రిక్తత

- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులను అడ్డుకున్న నాయకులు
- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం
- యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ పరిపాలన భవనం ముందు ఆందోళన



సేఫ్టీ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల కార్మికులు వెళ్లకుండా అడ్డుకున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ప్రధాన ట్రైనింగ్ సెంటర్ వద్ద బుధవారం స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఉదయం 9 గంటల సమయంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది కార్మికులు సేఫ్టీ (ప్లాంటులోకి వెళ్లాలంటే భద్రతాపరమైన తరగతుల)కు హాజరయ్యేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్, నిర్వాసితుల ఐక్య సంఘం నాయకులు, విధుల నుంచి తొలగింపబడిన కాంట్రాక్టు కార్మికులు ట్రైనింగ్ సెంటర్ వద్దకు వచ్చారు. ఇతర రాష్ట్రాల కార్మికులను సేఫ్టీకి వెళ్లకుండా వారు అడ్డుకున్నారు. దీంతో వారిని తీసుకు వచ్చిన వ్యక్తి కార్మిక నాయకులతో వాగ్వాదానికి దిగాడు. ఇతర రాష్ట్రాల కార్మికులు కూడా సేఫ్టీకి వెళ్లేందుకు యత్నించడంతో వివాదం చోటుచేసుకుంది. కాసేపయ్యాక ఇతర రాష్ట్రాల కార్మికులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం కార్మిక నాయకులు ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వాసితులను, ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహించిన అనుభవం కలిగిన కార్మికులను తొలగించి ఎలాంటి అనుభవం లేని కార్మికులను ఇక్కడకు తీసుకువచ్చి పనులు చేయిస్తుండడం దారుణమన్నారు. దీనివల్ల కార్మికుడి భద్రత కొరవడుతుందని, ఫలితంగా ప్లాంటుకు ప్రమాదమన్నారు. 18 ఏళ్లు నిండని వారిని సైతం తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తాము అడ్డుకుంటామని, యాజమాన్యం దిగొచ్చేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఇకపై రోజూ అడ్మిన్ భవనం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పితాని భాస్కరరావు, ఎన్.ప్రసాద్, కె.వంశీకృష్ణ, అప్పారావు, రమణ, సింహాచలం, కిరణ్, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికపై బీజేపీ విజయోత్సవం

బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసిన నాయకులు



స్వీట్లు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఎంపికవ్వడంతో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ 152 ఓట్ల తేడాతో విజయం సాధించడంతో దేశంలో సుపరిపాలనకు మరింత బలం చేకూరిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా పీఎం మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, సొంబాబు, సురేశ్, రంగనాయకులు, అప్పలరాజు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

14న బీజేపీ సభను విజయవంతం చేయాలి

దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంతోషమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేతు రమేశ్ అన్నారు. బుధవారం గాజువాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న రైల్వే గ్రౌండ్‌లో జరగనున్న బీజేపీ బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతారన్నారు. గాజువాక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం విశేష కృషి చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, కరణంరెడ్డి నరసింగరావు, నూకరాజు, సోంబాబు, శ్రీనివాసరావు, యల్లాజీరావు, తదితరులు పాల్గొన్నారు.



వర్షానికి రహదారిపై నిలిచిపోయిన నీరు



గోతుల్లో నిండిన వర్షపు నీటితో చిత్తడిగా మారిన శ్రీనివాస నగర్ రోడ్డు

భారీ వర్షం: రోడ్లు జలమయం

అగనంపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి, లంకెలపాలెం ఉక్కు నిర్వాసిత గ్రామాలు, పార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రెండు గంటలకు పైగా తెరిపివ్వకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు ప్రవహించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోత కొనసాగగా.. ఆ తరువాత ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరు రోడ్లపై పారడంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల వారపు సంతకు వచ్చిన కొనుగోలుదారులు ఇబ్బందులకు గురయ్యారు.

పూడ్చని గోతులతో ఇబ్బందులు

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్ రోడ్డు-3లోని రహదారులను యూజీడీ పైపు లైన్ల కోసం తవ్విన గోతులను తిరిగి సక్రమంగా పూడ్చకపోవడంతో వర్షపు నీటితో చిత్తడిగా మారాయి. గోతుల్లో నీళ్లు నిండి, బురదమయంగా మారడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోతులను పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



డొంకాడలో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభం

డొంకాడలో రాజ్యమేలుతున్న చీకటి

- ఏడాదిగా వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

అగనంపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడలో చీకటిపడితే చాలు అంధకారం రాజ్యమేలుతోంది. పలు వీధుల్లో లైట్లు పడకేసి ఏడాదైనా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రయితే వీధులన్నీ చీకటిమయంగా మారుతున్నాయని, బయటకు రావాలంటేనే భయమేస్తోందని మహిళలు, యువతులు వాపోతున్నారు. వీధి లైట్లు వెలగడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. రాత్రయితే చీకటికి తోడు వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

చెరువును శుభ్రం చేసిన పారిశుధ్య సిబ్బంది



చెరువులోని వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనాలతో అధ్వానంగా మారిన నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువును బుధవారం పారిశుధ్య సిబ్బంది శుభ్రపరిచారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నిండుకుండలా మారిన కృష్ణమహంతి చెరువులో ఈనెల 7 వరకు గణనాథులతో పాటు పూజా సామాగ్రిని భక్తులు నిమజ్జనం చేశారు. దీంతో చెరువులో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వస్తుండడంతో పారిశుధ్య సిబ్బందితో పాటు స్థానిక యువకులు ఎక్స్‌కవేటర్‌తో వాటిని బయటకు తీసివేశారు. చెరువును శుభ్రపరచడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 16, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

పట్ట పగలే వెలుగులు



పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్ దిగువ ప్రాంతాలు, జయప్రకాశ్‌నగర్, పాత గోపాలపట్నానికి వెళ్లే రహదారిలో పలు కాలనీల్లో పది రోజులుగా హైమాస్ట్ వీధి దీపాలు పగలు రాత్రి అని తేడా లేకుండానే వెలుగుతున్నాయి. దీనిపై అనేక ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్

పెందుర్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం తాడేపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి చేపట్టిన చర్యలు వివరించారు. అలాగే పార్టీ ఆదేశాలతో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతం అయ్యిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని జగన్‌కు అదీప్‌రాజ్ వివరించారు. నియోజకవర్గంలో అదీప్‌రాజ్ పనితీరు పట్ల జగన్ అభినందించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెందుర్తిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ విరాట్‌నగర్ కాలనీలో రూ.31.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ సేనాపతి శంకరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అన్ని కాలనీల్లో రహదార్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పరిసర కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి సంఘం ప్రతినిధి పిల్లా శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

కళాశాల ఆక్రమించిన భూమి ఏపీఐఐసీకి చెందినదే

- ఇంజనీరింగ్ కళాశాలలో నిర్మాణం జరుగుతున్న స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



నరవలో విశాఖ ఇంజనీరింగ్ యాజమాన్యం చేపట్టిన అక్రమ నిర్మాణం

గోపాలపట్నం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక నరవ గ్రామంలో విశాఖ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అక్రమ నిర్మాణం చేపడుతున్న భూమి ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి చెందిందంటూ పెందుర్తి రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. విశాఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చిన విషయం విదితమే. అయితే ఈ ఆక్రమణపై ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి పెందుర్తి మండల రెవెన్యూ అధికారులు స్పందించి కళాశాల వద్ద నిర్మాణం జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశం ఏపీఐఐసీకి చెందినదిగా అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలోని కొంత భూమిని ఏపీఐఐసీకి గతంలో ప్రభుత్వం అప్పగించిందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ ఆక్రమణపై అధికారులు ఏపీఐఐసీకి లేఖ పంపనున్నట్లు తెలిపారు.

ఆక్రమణలో గ్రామ స్థాయి సిబ్బంది కీలక పాత్ర

నరవ గ్రామం మండల కేంద్రానికి, జోనల్ కార్యాలయానికి దూరంగా ఉంది. ఈ గ్రామంలో ఎటువంటి ఆక్రమణలు జరిగినా ముందుగా గ్రామస్థాయిలోని రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందుతుంది. అయితే కబ్జాదారులు కిందిస్థాయి ఉద్యోగులను మచ్చిక చేసుకోవడంతో గ్రామంలో ఏం జరిగినా ఉన్నతాధికారులకు తెలియడం లేదు. ప్రస్తుతం కళాశాలలో విషయంలో కూడా అలానే జరిగుంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. అయి తే కళాశాల యాజమాన్యం ప్రభుత్వ భూమిని ఆక్రమిచి నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో ఉన్న మరికొంత భూమిని కూడా క్రమబద్ధీకరణ చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని విశ్వసనీయ సమాచారం. కళాశాల యాజమాన్యం చేపడుతున్న ఆక్రమణలు వెలుగులోకి రావడంతో ఈ భూమిని క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసిందని తెలిసింది.

మందకొడిగా కర్నూలు ఉల్లిపాయల విక్రయాలు



రైతుబజార్‌లో విక్రయిస్తున్న కర్నూలు ఉల్లిపాయలు

గోపాలపట్నం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుబజారుల్లో దేశవాళీ (కర్నూలు) ఉల్లిపాయల విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. రైతులు పండించిన ఉల్లిపాయలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుబజారుల్లో విక్రయాలు చేపడుతున్నారు. అయితే ఉల్లిపాయల పరిమాణం కాస్త చిన్నగా ఉండడంతో కొనుగోలుదారులు వీటిని కొనడానికి పెద్దగా మొగ్గు చూపడం లేదు. ప్రస్తుతం వీటి ధర కిలో రూ.15కి విక్రయిస్తున్నప్పటికీ కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. గోపాలపట్నం రైతుబజారులో సాధారణ రకం మహారాష్ట్ర ఉల్లిపాయలు రోజుకు కనీసం 4 టన్నులు విక్రయాలు జరిగేవి. కానీ కర్నూలు ఉల్లిపాయలు రోజుకు కనీసం రోజుకు ఒక టన్ను కూడా విక్రయం జరగడం లేదు.

నాణ్యత లేక కొనుగోలుదారుల గగ్గోలు

ఉల్లిపాయల్లో నాణ్యత ఉంటే ఎంత ధరైన కొనుగోలు చేయడానికి వెనుకాడరు. అయితే రైతుబజారులో ప్రస్తుతం మహారాష్ట్ర రకం ఉల్లిపాయలు లేకపోవడంతో కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర ఉల్లిపాయల ధర హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20 ఉండగా బహిరంగా మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకూ విక్రయిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు.

ములగాడ రోడ్డు నిర్మాణానికి ఆటంకం

- అండర్‌గ్రౌండ్ విద్యుత్ వైర్లను వేయడానికి రోడ్లను తవ్వడమే కారణమంటున్న స్థానికులు

మల్కాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములగాడ రహదారి పనులు చేపడదామంటే ఏదోక ఆటంకం వస్తూనే ఉంది. శంకుస్థాపన అనంతరం మొదలు పెడదామంటే వర్షాల కారణంగా పనులను కొన్ని రోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఇక ఎలాగైన పనులు పూర్తి చేదామని అనుకున్న సమయంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వైర్లను వేయడానికి విద్యుత్ శాఖ రోడ్డును తవ్వేశారు. ఇప్పుడు ఆ పనులు పూర్తయితే గానీ రహదారి పనులు మొదలు పెట్టడం అవ్వదు. దీంతో స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో రోడ్డు వస్తుందని ఆశించామని, కానీ ఇప్పుడు పనులు మళీ వాయిదా పడడంతో బాధాకరంగా ఉన్నదని స్థానికులు అభిప్రాయపడ్డారు.



బర్మా కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న అధికారులు

టిడ్కో గృహ సముదాయాల పరిశీలన

పెదగంట్యాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలోని టిడ్కో గృహ సముదాయాలను, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పనులను టిడ్కో, టాటా ప్రాజెక్టు అధికారులు బుధవారం పరిశీలించారు. టిడ్కో డీఈ రాజేశ్ చంద్ర, ఏఈలు రవికుమార్, బీపీఎన్ చంద్ర, టాటా ప్రాజెక్టు ఏఈ గోపాల్ ఇక్కడ జరుగుతున్న సివిల్ పనుల నాణ్యతా ప్రమాణాలను తిలకించారు. టిడ్కో గృహ సముదాయానికి పది రోజుల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని డీఈ పేర్కొన్నారు. అధికారుల వెంట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యుడు జి.ఆనంద్, తదితరులు ఉన్నారు.

నేడు పాత గాజువాకలో సీపీఎం మహా ప్రదర్శన

గాజువాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ఈవోఐలను నిరసిస్తూ, ఉక్కు పరిరక్షణ కోసం గురువారం పాత గాజువాక జంక్షన్ నుంచి కొత్త గాజువాక వరకు సీపీఎం ఆధ్వర్యంలో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావులతో పాటు పలువురు నాయకులు హాజరవుతారన్నారు. సాయంత్రం ఐదు గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఉక్కు కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు.

సీపీఎం ప్రదర్శనను విజయవంతం చేయాలి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడం ఆంధ్రుల అందరి బాధ్యత అని ఐద్వా జిల్లా నాయకురాలు జి.మణి అన్నారు. స్టీల్ ప్లాంట్ ఈవోఐలను నిరసిస్తూ గురువారం పాత గాజువాకలో జరగనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను షీలానగర్‌లో ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సనపల జగన్నాథరావు, ఎ.గాంధీ, మల్లిక , శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

అగనంపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు పవిత్రోత్సవ, అధ్యయనోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు, హోమాలు, లక్ష కుంకుమార్చన, లక్ష తులసీపూజ, పూర్ణాహుతి, పంచామృతాభిషేకాలను నిర్వహిస్తామన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌కు చెందిన లొల్ల రామారావు, లలితకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.83 వేలను బుధవారం కార్పొరేటర్ బొండా జగన్ చెక్కుల రూపంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కష్టాల్లో ప్రజలు ఉన్నప్పుడు తాను అండగా ఉంటానని ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడు ఆ మాటలను నిలబెట్టుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, లక్కరాజు సోమరాజు, బొట్టా ప్రకాశ్, రాజన్‌రాజు, కర్రి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు పొందిన 2,927 మందికి రిజిస్ట్రేషన్లు

- తహశీల్దార్ వెంకట అప్పారావు



తహశీల్దార్ వెంకట అప్పారావు

పెందుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రెవెన్యూ పరిధిలో 2016లో ప్రభుత్వ స్థలాలకు క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన 2,927 లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నామని తహశీల్దార్ వెంకట అప్పారావు తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లబ్ధిదారుడు ఫొటో, ఆధార్‌కార్డు, ఇద్దరు సాక్షులు వారి ఆధార్‌కార్డులు తీసుకుని వస్తే ప్రస్తుతం నివాసముంటున్న స్థలాన్ని లబ్ధిదారుడి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే డాక్యుమెంట్‌తో పాటు పట్టా అందజేస్తామని తెలిపారు. పట్టా రిజిస్ట్రేషన్ సమయంలో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతుందని తెలిపారు. అలాగే జీవో నంబర్ 30 ప్రకారం అభ్యంతరాలు లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులు ఇప్పటి వరకు 1500 అందాయన్నారు.

జడ్సీగా శంకరరావు బాధ్యతలు స్వీకరణ



నూతన జడ్సీ శంకరరావుకు మొక్కను అందిస్తున్న ఉద్యోగులు

వేపగుంట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో జోన్ 8 ఇన్‌చార్జి జడ్సీగా హెచ్.శంకరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జోన్8 ఉద్యోగులు, విభాగాధిపతులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోన్8లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనతరం పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

కల్యాణ వెంకన్నను దర్శించుకున్న నూతన జడ్సీ

నాయుడుతోట శేషాద్రి కొండపై కొలవైన కల్యాణ వెంకటేశ్వరుడిని నూతన జడ్సీ హెచ్.శంకరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

13న రాష్ట్రస్థాయి పెన్షనర్ల సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

మల్కాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 13న రాష్ట్రస్థాయి పెన్షనర్ల సమావేశం జరగనున్నదని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.హుస్సేన్ తెలిపారు. 61వ వార్డు వెంకన్నపాలెంలో సీఐటీయూ కార్యాలయంలో పెన్షనర్ల సమావేశం బుధవారం జరిగింది. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్‌దార్లకు రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, సామాజిక పెన్షన్ రూ.4వేలు ఇవ్వాలని కోరారు. 13న విజయవాడలో జరిగే సమావేశానికి అందరూ హాజరు కావలని కోరారు. ఈ సమావేశం ద్వారా పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని అన్నారు. త్వరలో ఢిల్లీలో కూడా భారీ సమావేశం నిర్వహించడానికి ప్రయత్నాలు జరుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు

'ప్రసాద్' పనులు వేగవంతం చేయండి

» పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్



సింహగిరిపై పనులను పరిశీలిస్తున్న అజయ్‌జైన్

సింహాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని పర్యాటక శాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అధికారులను ఆదేశించారు. సతీ సమేతంగా బుధవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న అనంతరం ప్రసాద్ పథకం పనుల పురోగతిని పరిశీలించారు. చందనోత్సవ రోజున కూలిన గోడ పునర్నిర్మాణ పనులను పరిశీలించి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఆఫీ థియేటర్, కోల్డ్‌స్టోరేజీ, తదితర పనులను సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పర్యాటకశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ విజయభాస్కరరెడ్డి, ఏఈ సీతారామారావు, దేవస్థానం ఏఈ రవిరాజ్, టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్, తదితరులున్నారు.

23 నుంచి సింహగిరిపై శరన్నవరాత్రులు

సింహాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 23 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. అక్టోబరు 2నాటి విజయదశమి వరకు జరుగుతాయన్నారు. ఆయా రోజుల్లో హంసమూలన శ్రీమద్రామాయణ పారాయణం, ప్రతిరోజు సాయంత్రం 5గంటలకు చతుర్భుజి తాయార్, సువర్ణ అమ్మవార్ల బేడా తిరువీధి నిర్వహిస్తారన్నారు. విజయదశమి సందర్భంగా అక్టోబరు 2న కొండదిగువ స్వామివారి పూదోటలో శమీపూజ ఉంటుందన్నారు. ఆరోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు.

డయల్ యువర్ ఆర్ఎంకు 18 కాల్స్



మాట్లాడుతున్న ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి 18 ఫోన్ కాల్స్ వచ్చాయి. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కాల్స్ స్వీకరించారు. కాకినాడ, రాజమండ్రిలకు ఫాస్ట్‌సర్వీసులు నడపాలని ఎంవీపీకాలనీకి చెందిన ఒకరు, విశాఖ నుంచి రాజమండ్రి, కాకినాడకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో సర్వీసుల సంఖ్య పెంచాలని మధురవాడకు చెందిన వ్యక్తి కోరారు. స్త్రీశక్తి పథకం బస్సులను యాత్రాస్థలాలకు నడపాలని కొత్తగాజువాక, మధ్యాహ్నం 4 గంటల తరువాత అన్ని రూట్లలోను అదనపు సర్వీసులు నడపాలని ఎన్ఏడీకి చెందిన వ్యక్తి సూచించారు. బస్టాపుల్లో బస్సులు ఆపడం లేదని తాటిచెట్లపాలేనికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

కొనసాగనున్న ప్రయోగాత్మక హాల్ట్‌లు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు కల్పించిన ప్రయోగాత్మక హాల్ట్‌లు కొనసాగుతాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వీటిలో చిన్న గంజాం, భీమడోలు, సామర్లకోట, ఏలూరు, అత్తిలి, డోనకొండ, నందలూరు స్టేషన్లు ఉన్నాయన్నారు.



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

స్నాతకోత్సవాన్ని సమర్థంగా నిర్వహించాలి

» ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని సమష్టిగా పనిచేస్తూ సమర్థంగా నిర్వహించాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. అక్టోబరు 15న నిర్వహించనున్న స్నాతకోత్సవానికి సంబంధించి వివిధ కమిటీల సభ్యులు, అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిసెప్షన్, ఆర్గనైజింగ్, సైటేషన్ కమిటీలు తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తిచేసేలా ప్రణాళికను సిద్ధం చేసుకుని అమలుచేయాలన్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారి సంఖ్య, అవార్డులు, మెడల్స్ సిద్ధం చేయాలని పరీక్షల విభాగం అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో పాటు వారి కుటుంబసభ్యులు హాజరవుతారని, దీనిని దృష్టిలో పెట్టుకుని సీటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సిబ్బందికి, విద్యార్థులకు పాసులు మంజూరుచేసే విధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్నాతకోత్సవ మందిరంలోకి ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉండాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తూ ప్రగతిని ఎప్పటికప్పుడు కమిటీ చైర్మన్లకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్, డీన్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో 'తిప్పు నాన్న మీసం' స్క్రిప్ట్‌నకు పూజలు



సింహగిరిపై స్క్రిప్ట్‌తో రచయిత

సింహాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సాయి ప్రీతమ్‌రెడ్డి రచించిన 'తిప్పు నాన్న మీసం' చిత్రం స్క్రిప్ట్‌నకు బుధవారం అప్పన్న సన్నిధిలో పూజలు చేశారు. అంతరాలయంలో స్క్రిప్ట్‌ను స్వామి చెంత ఉంచి అర్చకులు పూజలు చేశారు. సామాన్య కుటుంబంలో పుట్టిన యువకుడు నాన్న కోసం నటుడిగా, తల్లికోసం డాన్సర్‌గా మారడమే సినిమా ఇతివృత్తమన్నారు. హీరో నానికి కథ వినిపించి సినిమా తీస్తానన్నారు.

బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్‌లో గ్రేటర్ విశాఖ

» వాతావరణ స్థితిస్థాపకత కోసం 19వ వార్డులో వి-పుల్ వేదిక

» నగర వాసుల ఆలోచనలకు ఆహ్వానం

» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్-2025లో గ్రేటర్ విశాఖ ఒకటిగా నిలిచిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టణ సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనడంలో అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, ఇందులో భాగంగా, జీవీఎంసీ వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వి-పుల్) మోడల్‌ను పరీక్షిస్తూ 19వ వార్డులోని శివగణేశ్‌నగర్‌లో వాతావరణ స్థితిస్థాపకతను బలోపేతం చేయడానికి ప్రజల ఆలోచనలు, సూచనలను ఆహ్వానించినట్టు తెలిపారు. ఆయన బుధవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ 99 దేశాల నుంచి 600 కంటే ఎక్కువ నగరాలు పోటీపడిన బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్-2025 ఫైనలిస్టుగా విశాఖ ఎంపికవడం గర్వకారణమన్నారు. ఇది ప్రజా-కేంద్రీకృత, వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో జీవీఎంసీ కట్టుబాటును ప్రతిబింబిస్తుందన్నారు. వీ-పుల్ వేదిక ద్వారా ప్రజలు, సంస్థలు, సాంకేతిక నిపుణులు కలిసి కో-క్రియేషన్ పద్ధతిలో పరిష్కారాలు కనుగొనేందుకు వేదికగా పనిచేస్తోందన్నారు. గతంలో 41వ వార్డులో నిర్వహించిన కో-క్రియేటివ్ వర్క్‌షాప్‌లు చిన్నవి అయినప్పటికీ ప్రభావవంతమైన పరిష్కారాలను అందించాయన్నారు. ఆ అనుభవంతో ప్రోటోటైప్‌ను 19వ వార్డుకు విస్తరించి, వరదలు, తుఫానులు, ఉష్ణ తరంగాలతో అధికంగా ప్రభావితమయ్యే మత్స్యకార కుటుంబాల సమస్యలపై దృష్టి పెడతామన్నారు. ప్రతి పౌరుడు తమ ఆలోచనలు, సూచనలను పంచుకోవాలని, ప్రతి ఆలోచన విలువైనదేనని, సమష్టి జ్ఞానం, చర్యల ద్వారా బలహీన వర్గాలను రక్షించి, బలమైన, సురక్షితమైన, స్థితిస్థాపకమైన విశాఖపట్నం నిర్మించవచ్చన్నారు. జీవీఎంసీ అధికార వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు లేదా ప్రచార పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు ఆలోచనలు, సూచనలను పంచుకొని సహకరించాలన్నారు. ఈ నెలలో 19వ వార్డులో జీవీఎంసీ కో-క్రియేటివ్ వర్క్‌షాప్‌లు నిర్వహించనుందని, వాటిలో ప్రజలు, వార్డు సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను రూపుదిద్దుతారన్నారు. సంబంధిత వివరాల కోసం వార్డు సచివాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి స్వప్న, వి-పుల్ ప్రాజెక్టు మేనేజరు ఇమ్మానుయేల్, జూనియర్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అధికారి జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం సీట్లపై గోప్యత ఎందుకు

» స్టాండింగ్ కమిటీ సమావేశంలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్ల కేటాయింపులో పారదర్శకత లేదని భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పడు ఆరోపించారు. బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాలలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలో పేదలకు 25 శాతం కోటా కింద ఎన్ని సీట్లు కేటాయించారని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టం కింద సీట్లు పొందిన విద్యార్థులకు కొన్ని యాజమాన్యాలు ప్రవేశాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి విద్యాశాఖ అధికారులు బదులిస్తూ జిల్లాలో ఉచిత సీట్ల కేటాయింపు వివరాలను సభ్యులకు అందజేస్తామన్నారు. ప్రైవేటు యాజమాన్యాలతో చర్చించిన మీదట సీటు పొందిన విద్యార్థులకు ప్రవేశాలు ఇచ్చారన్నారు.

అన్నవరంలో మరో 19 ఎకరాల భూ సేకరణ

» పర్యాటక శాఖకు అప్పగించే యోచన

» పోలీసు బందోబస్తు మధ్య స్వాధీనం



స్వాధీనం చేసుకున్న భూమి

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామంలో రెవెన్యూ అధికారులు సాగుదారుల ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీఓ సంగీత్ మాధుర్, తహశీల్దార్ పైల రామారావు, ఇతర సిబ్బంది పోలీసుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భీమిలి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భూములను స్వాధీనం చేసుకోవడానికి, చదును చేయడానికి జేసీబీలను కూడా తీసుకువచ్చారు. గ్రామస్థులను, ఫొటోలు తీయడానికి విలేకరులను కూడా అనుమతించలేదు. ఈ గ్రామం భోగాపురం ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండడంతో గతంలో కూడా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కొన్ని భూములను సేకరించి, స్టార్ హోటల్‌కు కేటాయించారు. ఇప్పుడు కూడా అటువంటి కేటాయింపు కోసమే స్వాధీనం చేసుకుంటున్నట్టు తెలిసింది. గ్రామానికి చెందిన అల్లిపల్లి ఎల్లాజీ 3.4 ఎకరాలు, అల్లిపల్లి సత్యవతి 4.1 ఎకరాలు, పేర్ల ధనలక్ష్మి 3.9 ఎకరాలు, శీరము త్రివేణి 3.8 ఎకరాలు, కుంచం సంధ్యారాణి 3.8 ఎకరాలను 50 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. కానీ వారి వద్ద పట్టాలు లేవు. 1990లో రెవెన్యూ అధికారులు ఈ భూములను నలుగురు వ్యక్తులకు పట్టాలిస్తే సాగుదారులు అడ్డుకుని ఆధారాలు చూపించి పట్టాలను రద్దుచేయించారు. నాటి నుంచి తమకు పట్టాలు ఇవ్వమని రెవెన్యూ అధికారులను కోరుతూనే ఉన్నారు. ప్రస్తుతం ఈ భూములతో పాటు సమీపంలోని మరిన్ని భూములను కూడా స్వాధీనం చేసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ భూము లను స్వాధీనం చేసుకోకూడదని, కోర్టులో కేసు ఉందని సాగుదా రులు చెబుతున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల వద్ద ప్రస్తావించగా సాగుదారుల వద్ద భూములకు సంబంధించిన పట్టాలు లేవని, ప్రభుత్వ అవసరాలకు వాటిని ఎప్పుడైనా తీసుకునే అవకాశం ఉందన్నారు.

క్రైం... crime news

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ (45)ను ఓ వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ వి.వాణిశ్రీ తెలిపారు. బుధవారం జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హార్బర్ పోలీస్‌స్టేషన్ పరిధి చిలకలజంక్షన్ వద్ద మురుగు నీటి శుద్ధిప్లాంట్ (ఎస్‌టీపీ) సంపు డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీతమ్మధార, కైలాసపురం, కంచరపాలెం, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, దొండపర్తి, తాటిచెట్లపాలెం, డాబాగార్డెన్స్, జగదాంబజంక్షన్ పాతనగరం తదితర ప్రాంతాల నుంచి గెడ్డల ద్వారా ప్రవహించే మురుగునీరు, వర్షంనీటితోపాటు యూజీడీ నెట్‌వర్క్ నుంచి వచ్చే మురుగునీరు కాన్వెంట్ జంక్షన్‌లోని పంప్‌హౌస్ నుంచి చిలకలుజంక్షన్‌లోని 38 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్)కి చేరుతుంది. ఇక్కడి సంపులో ఈనెల ఎనిమిదిన సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సిబ్బందికి కనిపించింది. దీంతో హార్బర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ సింహాద్రినాయుడు చేరుకుని మృతదేహాన్ని తీయించారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై దుస్తులు, గాయాలు లేవని, ఉబ్బిపోయిందన్నారు. వర్షాల కారణంగా గెడ్డల్లో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో డ్రైనేజీలో పడిపోయివుంటారని, మృతదేహం సంపు వద్దకు కొట్టుకు వచ్చి ఉంటుందని సీఐ తెలిపారు. కేసు నమోదుచేశామని, వివరాలు తెలిస్తే హార్బర్ పోలీస్‌స్టేషన్, లేదా 9440796013 నంబరుకు గానీ సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

అగనంపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానిక క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో గల రైల్వే ట్రాక్‌పై బుధవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకి చెందిన కె.సత్యనారాయణ (60) కొంత కాలంగా కూలీ పనులు చేసుకుంటూ ఫార్మాసిటీ కాలనీలో ఉంటున్నాడు. క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో గల రైల్వే ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని 27 గొర్రెలు మృతి

ఆనందపురం సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో 27 గొర్రెలు మృతిచెందాయి. ఈ సంఘటన బుధవారం మిందివానిపలెం వద్ద జరిగింది. మండలంలోని పేకేరు గ్రామానికి చెందిన చందక సూర్యనారాయణకు సుమారు 300 గొర్రెలున్నాయి. ప్రతి రోజు వాటిని మేతకు తీసుకువెళ్తుంటాడు. బుధవారం ఉదయం గొర్రెలను మిందివానిపాలెం ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అవి జాతీయ రహదారి ఒడ్డున మేస్తుండగా పెందుర్తి నుంచి ఆనందపురం వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో 27 గొర్రెలు అక్కడకక్కడే మృతి చెందాయి. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పెట్రోల్, ట్రాఫిక్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఫిర్యాదుదారుడిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అద్దెకు తీసుకున్న కారులో ఉన్న వ్యక్తిపై దాడి చేసి, అతడి వస్తువులతో పాటు, కారుతో పరారైన సంఘటనపై ప్రయాణికుడిదే తప్పంటూ ఫిర్యాదు రావడంతో ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ దేముడు నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడలోని పాయకాపురం సుందరయ్యనగర్‌కి చెందిన చల్లా కృష్ణంరాజు రియల్ ఎస్టేట్, క్వారీ మైనింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 3న విశాఖ వచ్చి కారును బుక్ చేసుకుని, భీమిలి, రుషికొండ వెళ్లి, రాత్రి అప్పుఘర్ సమీపంలోకి వచ్చారు. పబ్లిక్ టాయ్‌లెట్ వద్ద కారును నిలిపి, డ్రైవర్ సిరిగుడి రాజు వెళ్లాడు. ఆ సమయంలో ఆరుగురు వ్యక్తులు కృష్ణంరాజుపై దాడి చేసి గాయపరిచి కారుతో పరారయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయగా, నిందితుడ మధు వంశీకృష్ణ తన కారును నవీన్ రాజాకు ఇచ్చానని, సాయంత్రం తిరిగి అప్పగించకపోవడంతో జీపీఎస్ ట్రాక్ ద్వారా అప్పుఘర్ వద్ద ఉన్నట్టు గుర్తించి, స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశానన్నారు. ఈ క్రమంలో వంశీకృష్ణపై కృష్ణంరాజు దాడి చేశాడని తెలిపాడు. దీంతో పోలీసులు కృష్ణంరాజుపై కూడా కేసు నమోదు చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సీతంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే క్వార్టర్స్‌లోని ఓ ఇంటిలో పేక ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.11 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉమాకాంత్ తెలిపారు.

బాణసంచా నిల్వలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాణసంచా

మహారాణిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు పోలీసులకు అందిన సమాచారంతో కురుపాం మార్కెట్ సమీపంలో పాలూరి వరప్రసాద్ ఇంటి వద్ద సోదాలు చేసి రూ.2.06 లక్షల విలువైన మందుగుండు సామగ్రిని, బండారు అప్పలరాజు వద్ద రూ.50 వేల విలువైన, టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని బొట్టా భవానీ శంకర్ వద్ద రూ.10 వేల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

శ్రీవారి ఆలయంలో పాము కలకలం



వెంకన్న ఆలయంలో పాము

సాగర్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రుషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఓ పాము కలకలం రేపింది. గమనించిన అర్చకులు చైన్ స్నేచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. అతడు శ్రమించి పామును వెలికి తీశారు. సుమారు ఐదు అడుగుల పొడవుంది.

కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

» సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)లో పది, ఇంటర్ తరగతుల్లో శతశాతం ఫలితాలు సాధించాలని సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. చైతన్యనగర్‌లోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల సమగ్రశిక్షా అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, జీసీడీవోలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శత శాతం ఫలితాలకు విద్యాపథకం అమలుచేయాలన్నారు. బాలికలకు అసౌకర్యం కలగకుండా, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏపీసీలు, జీసీడీవోలు ప్రతిరోజు ఒక కేజీబీవీను సందర్శించి వసతులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం చివరికి కేజీబీవీల్లోని సివిల్ పనులు పూర్తిచేయాలని స్పష్టంచేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు విద్యార్థినుల ఆరోగ్యం, మానసిక స్థైర్యం, ఒకేషనల్ విద్యపై వివరించారు. సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని, ఇంకా ఇతర కార్యక్రమాలు, సెల్ఫ్ డిఫెన్స్ అమలు చేయాలని, స్వచ్ఛమైన వాతావరణంలో, మంచి పోషకాలతో కూడిన భోజనం అందించాలన్నారు. సమీక్షలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి, చీఫ్ ఇంజనీరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.